558

MRUTCHAKATIKAM.

49

(In Prose.)

STUDENTS' LITERARY ASSOCIATION, LIBRARY
553
1.57

D. V. AVADHANY.

శ్రీ

మృచ్ఛకటికము.

శతావధానులు తిరుపతి వేంకటేశ్వరకవుల
తెనుగు నాటకము ననువదింపఁ బడినది.

STUDENTS LIBRARY ASS...

కాకినాడ:
శ్రీపతి ముద్రాక్షరశాల న్ముద్రితము.
1934

కాపీరైట్. వెల 0-12-0.

ఉపోద్ఘాతము.

మధ్యమ తరగతుల విద్యార్థులు చదివి మహాకవుల యొక్క రచనలపై నుత్సాహము గల్పించుటకుఁ గాను వారి ములను సంగ్రహ మొనర్చి వారి శైలినే యనుకరించుచు వ్రాయఁ బడిన పఠనీయ గ్రంథము లాంగ్లభాష యందు వేనవేలు గలవు గాని మన యాంధ్రమునం దట్టివి చాల తక్కువ. ఇట్టివి చదువుట వలన నా మహాకవుల కావ్యములందలి యితివృత్తము తెలిసి యుండుటచే నుత్సాహము కలిగియున్న రల బాలురకవి సుబోధకములై యలరారును. పూర్వాధునాతన విద్వజ్జనుల గౌరవమున కాకరమై కల్పనాచాతుర్యమును జూపునట్టి దిట్టి దింకొకటి లేదని శూద్రకవిరచితమగు మృచ్ఛకటికము చాల ప్రసిద్ధి గాంచినది. దానికి శతావధానులు తిరుపతి వేంకటేశ్వరకవుల యాంధ్రీకరణము నాధారముగాఁ గైకొని వారి శైలి రుచిచూపుటకైఁ గొన్ని కొన్ని పద్యముల మధ్య నుదాహరింపుచు నీ కథ వ్రాయఁ బడినది. పాఠశాలాధికారుల మన్నన కిది పాత్రమై మా ప్రయత్నము సఫలమగునని యాసించు చున్నాను.

ఇట్లు విధేయుఁడు,

కాకినాడ,
24-12-1934.

కొల్లూరి సుబ్రహ్మణ్యం,
సంపాదకుఁడు.

మృచ్ఛకటికము.

ప్రథమప్రకరణము.

సకల సంపత్సమృద్ధం బగునుజ్జయినీపురంబునఁ బూర్వకాలమునఁ బేదవడిన వ్యాపారియు సుగుణవంతుఁడును నగు చారుదత్తుఁ డనుబ్రాహ్మణుఁడు కలఁడు. ఆతనిసుగుణంబు లనన్యలభ్యంబు లనిపొగడ్త కెక్కినవి. అందఱును దలలోని నాలుకయై వర్తిలునట్టి యాబ్రాహ్మణుఁ డర్థకల్యవర్తక మొనరించి దైవవశమునఁ బూర్వార్జిత మంతయుఁ గోలుపోయి దరిద్రుఁడై యవయుచుండెను. కలిమి గలనాఁడు చుట్టును మూఁగినవారు లేమి వచ్చుటతోడనే మదము లేనట్టిదంతి చెంత కైనను రాకుండఁ ద్యజించుతుమ్మెదలపగిది నాతని విడనాడిరి. జగత్తు ధనమూలము. కాని వదాన్యుఁడును గుణవంతుఁడును నగుటచే నాతని కీర్తి కేకొదవయును రాలేదు. కళలన్నియును దేవతల కిచ్చినచంద్రునిక్షయమువలె నాతఁడును దారిద్ర్యముచేఁ దేజమును వాసియు సర్వజనపూజ్యత నంధియుండెను.

ఆపట్టణంబున నాగ్రికలావతంసమై బోగముకొలములో జనించినను సాటిబోటులకతి సర్వజనవశ్యురాలు కాక సుగుణముల కాలవాలమై చక్కఁదనమున వసంతసేనం బోలు వసంతసేన యను నొకవారకాంత గలదు. ఆమెయుఁ జారుదత్తుని గుణగణముల నాలించి యామహానుభావునిదర్శనమెట్లొనర్తునా యని సందేహించుచు మనమునందలి కోరిక నానాఁటికి ద్విగుణీకృత మగుచుండ నొకనాఁడు చెలికత్తెతోఁగూడఁ గామదేవాలయంబునకుఁ బోయి యచ్చటఁ జారుదత్తుని గాంచి యాతనియందమునకు ముగ్ధురాలై సుగుణముల నీవఱకే విని యున్న దగుటచే దరిద్రుఁడనియైన బాటింపక వరించినది.

వసంతసేనకుఁ జారుదత్తునిపై ననురాగము దినదినాభివృద్ధిఁ గాంచుచుండెను. ఇట్లుండఁ గొంతకాలము గడచిపోయెను. ఒకనాఁటిసాయంసమయమున సంధ్యావందనాదికముల ముగించి చారుదత్తునకు సార్వకాలికమిత్రుఁడగుమైత్రేయుఁడాసమయమ్మున కరుదెంచి చూర్ణవృద్ధుఁడను నొకస్నేహితుఁడు పంపినాఁడని చెప్పి జాజిపూవులతావులఁ గ్రమ్ము నుత్తరీయము నిచ్చెను. అదివఱకు వేలకొలఁది ధనార్థులకు ధనంబు నన్నార్థులకన్నమును నితరకామ్యములు గోరినవారికి వారి వారికోరికల నొసంగిన యాచారుదత్తుఁ డది గ్రహించి నేఁటికి దైవము నాకిట్టిదుర్దశ ఘటించెఁ గదా యని యూర్పుచ్చసాగెను. పురుషునకు దారిద్ర్యము దుర్భరమైనది.

ఉ. చేరిక చింతకున్ బరులు సేయుతిరస్కృతి బంధుకోటికిన్
దూరము వైరి లేనిపగ, దోహద మాఱనిశోకవహ్నికిన్
దారల కీసడింపు విపినంబులపా లగు బుద్ధి బంధువుల్
చేరనిదారి లోపలికిఁ జేరియుఁ జంపనిచిచ్చు కాదొకో?

శా. దారిద్ర్యంబున సిగ్గు గల్గుఁ బ్రదపచేతన్ దేజమున్ బోవుఁ
దే, జోరాహిత్యమునన్ బరాభవము వచ్చున్ దాన
నిర్వేద మే, పారున్ దాన జనించు వంత మతి వమ్మై పోవు
దుఃఖమ్మునన్, గారించున్ మతిలేమి లేమి సకలానర్థప్రదం
బకటా!

గీ. మరణమందును దారిద్ర్య భరమునందు
మరణమే మేలు దారిద్ర్య భరముకంటెఁ
దత్సమయమాత్రదుఃఖప్రదంబు చావు
చచ్చినందాఁక దుఃఖ మొసంగు లేమి.

కొంతసే పాపరానిదుఃఖవేశంబునకు లోఁగి యాతఁడు మైత్రేయుని బిలిచి గ్రామదేవతలకు బలి యొసంగి ర మ్మని కోరెను. మైత్రేయుఁడు తనవంటి బ్రాహ్మణుఁ డేది చేయఁబోయి నను నద్దములోఁ గుడివైపెడమ నెడమ కుడివైపుగాఁ గాన్పించు నట్లు విపరీతముగాఁ దోఁచు ననియు, రాజవీథులలోఁ బ్రదోష సమయముల విటులు, వేశ్యాకాంతలు, రాజానుగ్రహము గల పురుషులు దిరుగాడుచుందు రనియుఁ, దనకుఁ బట్టపవలే వీథిల

నికిఁ బోవుట భయ మగుటచే నిట్టిసమయమున నెవరిచే నైనఁ జావు మూడు ననియు గారణములు చెప్పి బలిని దీసికొని పోవుటకు నిరాకరించెను. చారుదత్తుఁడును గొంతకాల ముండి తానే తీసికొని పోవచ్చు నని సమాధాని నిర్వర్తించుకొనుటకాయత్తుఁడయ్యెను.

సరిగ నీసమయంబున కే వసంత సేన సర్వాభరణభూషితురాలై రాజమార్గమున విలాసార్థము బయలుదేఱినది. ఆకాలమున నుజ్జయినీనగరంబును బాలించుచుండిన పాలకమహారాజునకు శ్యాలకుఁడు శకారుఁ డనువాఁడు కలఁడు వీఁడు పరమదుర్మార్గులలో నగ్రగణ్యుఁ డని పే రొంది తన కెదురైనవారి నకారణముగ నదలించుచు సర్వజనకంటకుఁ డై వర్తించు చుండెను. ఈదుర్మార్గుఁడు వసంత సేనయందచందముల రోసి కామాతురుఁ డై తత్సమాగమంబునకు వివిధోపాయముల నారయుచుండెను. రాజమార్గమునఁ బడి వచ్చుచున్నవసంత సేన నీక్షించి తగినయద నబ్బె నని సంతసింపుచు విటచేటులతోఁ గలిసి యామెను దఱుముకొని రాసాగెను. నోటికి వచ్చినట్లెల్లఁ బ్రేలుచు నాశకారుత్మలా మెంవెంట నంటిరి. ఆమె యబలను గాన రక్షింపు మని వేఁడుకొనెను. అందుచేతనే పోషింపఁబడుట కర్హురాలవు కావున మా శకారుని జెట్టఁబట్ట వలయు నని విటుఁడు సమాధాన మిచ్చెను. అందు చేత నే చంపఁబడ లే దని శకారుఁడు ప్రత్యుత్తర మొసంగెను. ఆమెయు బోయవానిని జూచి యడలుసారసాంగనవలెఁ

బులిని జూచి యాక్రందన మొనరించు నావురీతి దన్ను రక్షించు నుదారు లెవ్వరును దాపున లేమికిఁ జింతింపుచుఁ గొంచెము ధైర్యము వహించి మీరు దొంగలే నైనచో నామేన నమూల్యము లగు రత్నాభరణము లున్నవి వీని నన్నిటిని గ్రహించి నన్ను విడిచిపుచ్చుఁ డని కేలు మోడ్చి ప్రార్థించెను. విటుఁడును మేము సరసులమే కాని దుర్మార్గులము కామనియు, నుద్యానలతనుఁ బూవులు ద్రెంచుకతిను లుండ రనియు వందుచే నామె నగల కాసించువారము కామనియు బదు లిచ్చెను. శకారుఁడును నేను వరపురుషమనుష్యుఁ డను గావున నన్నుఁ గామింపుమని యామెపాదములపైఁ బడి ప్రార్థించెను. వసంతసేన యనురాగమునకు యోగ్యతకారణము గాని బలాత్కారము కా దనియుఁ దనమేనఁ బ్రాణము లుండఁగ నిన్నుఁ గామించుదానను గా ననియుఁ జెప్పి వాని నావలకుఁ ద్రోసివైచెను.

మ. కలిగెం బో భువి అంకుగూడెములు మూర్ఖైకె సుంత యోజిం
పుమా, వెలప్రోయాలవు కావటే పథిభవార్థ్వీజంబు చందం
బుగా, వెలచేతన్ గొనఁ దగ్గదీయొడలు నీవే లంజ వా
యందఱికిన్ గావల పున్నన్ వల పుండకున్న సమభావం బొప్ప
సేవింపుమా !

అని యుపన్యసించుచు, నామె నిరసించినందుకు శకారుఁడు మండిపడి యెట్లైన నామె నానాఁడు బంధించితీరవలెఁ

నని నిశ్చయించుకొని, కామదేవాలయములో నీగర్భదాసి
యాదరిద్రచారుదత్తుని జూచినది మొదలాతనిపైఁ దనమాన
సమును లగ్నము చేసి యున్న దని చారుదత్తుని యిల్లెడ
మవైపున నుండుటచే నామె తప్పించుకొని పోకుండఁ జూడ
వలయు నని విటశకారులను హెచ్చరించెను. ఈనిర్భాగ్యుఁ
డేది తెల్పరానిదో యదియే తెల్పినాఁ డని విటుఁడు వగచెను.
అపకారము జేయఁదలఁచినను దన కుపకారమే యైన దని
వసంతసేన సంతసించుచుఁ జారుదత్తునియింటిగుమ్మము సమీ
పించెను గాని తలుపులు మూసి యున్నవి. అంతట శకారుఁడును
వసంతసేన దాల్చినపూవులతావియు నామె ధరించినభూషణ
ముల గలగలధ్వనియు గుర్తుగ నాచీఁకటిలో నామెను బట్టుకొ
నుటకుఁ బ్రయత్న మొనరించుచుండ నీవ్యాహార మంతయు
మొదటినుండియుఁ దన కిష్టము లేనివాఁ డగుటచేతను స్వతస్సిద్ధ
ముగఁ గొంతవఱకుఁ గరుణామూర్తియు నగుటచే విటుఁడు
వసంతసేన నెట్లైన రక్షింపఁ దలఁచి యన్యాపదేశముగా నామె
కెఱిఁగించెను. వసంతసేనయు నతఁడు చెప్పినదానియర్థమును
గ్రహించి పూవులఁ దీసి పాఱవైచి మేనిభూషణంబులు
నడలించి లోలో విటునకుఁ గృతజ్ఞతాపూర్వకవందనంబు
లర్పించి యేదేవునిదయచే నైన నేపుణ్యాత్ము లైనఁ దలుపు
దెఱచిన బాగుగ నుండు నని యనుకొనుచుఁ జకిత యై
యాద్వారసమీపమున నిలిచి యుండెను.

చారుదత్తుఁ డింతలో జపము ముగించుకొని గ్రామదేవ తలకు బలి తీసికొనిపొమ్మని మైత్రేయుని మరలఁ గోరుకొనెను. మైత్రేయుఁడు మరలఁ బూర్వకారణములనే చెప్పి పోవ నిరాకరించెను. సార్వకాలికమిత్రుఁ డగు మైత్రేయుఁడు గూడ తన మాట వినకుండుటకుఁ దనఘోరదారిద్ర్యము గదా హేతు వని,

గీ. మాట విన రింటిచుట్టాలు మాఱుమొగముఁ
వెట్టుదురు మిత్రు, లాపద ల్పొరుఁగుఁగాంతి
వాయు, శీలంబు తఱుఁగుఁ, బైఁబడు నితరుల
పాపకృత్యంబులును పేదవాని కకట !

గీ. సుహృద మని యెంచి నాలోనఁ జొచ్చి తీవు
మందభాగ్యుండ నగునేను మడియునాఁడు
ఘోరదారిద్ర్యమా ! యేమి దారి నీకు ?
నిన్నుఁ గూర్చి విచారించు చున్నవాఁడ.

అనియుఁ జింతింపుచుండ మైత్రేయుఁ డిఁక నాతనిచిత్తము నకు నొప్పి కలిగించుట భావ్యము కా దని యెట్టకేలకు బలి తీసికొనిపోవుటకు సమ్మతించెను. మహాశూరుఁడు గావున నాబ్రాహ్మణుఁడు రదనిక యనుపరిచారికను దోడు గైకొని, బలియును దీపము నామెచేతి కిచ్చి తాను తలుపుగడియఁ దెఱచెను. వసంతసేన యాతురతతోఁ జూచుచున్నది కావునఁ దలుపు తెఱువఁబడుటకు సంతసించి దీపపువెలుఁగునఁ దాన

శకారాదులకుఁ గాన్పింతు ననుభయమునఁ జేటకోంగుతో నాదీపము నార్పివైచి లోనికిఁ బ్రవేశించెను. గాలివలన దీప మారిపోయిన దనుకొని మైత్రేయుఁడు మరల దీపమును వెలిఁగించుకొనివచ్చుటకై రదనికను వీథిలో నిలిపి తాను లోపలికిఁ బోయెను. ఈలోపున శకారాదులు వసంతసేనను వెదకికొనుచు నాతావునకు వచ్చి రదనికను జుట్టుముట్టిరి.

మైత్రేయుఁ డనంతరము దీపము వెలిగించి తెచ్చినతోడనే శకారాదులు తమతప్పుఁ దెలిసికొని రదనికను విడిచిపుచ్చిరి. శకారాదులు రాజస్యాలకునితో విరోధము ముప్పునకు హేతువనియు, వసంతసేనను స్వయముగాఁ దెచ్చియిచ్చిన బ్రతుకుదువు లేదేని నీవినాశము తప్ప దని చారుదత్తున కెఱిఁగింపు మని మైత్రేయునితోఁ బల్కి వెడలిపోయిరి.

గాలికొఱకుఁ జారుదత్తునికుమారుఁ డగురోహసేనుఁడు బయటఁ బరుండెను. చారుదత్తుఁడు లోనికిఁ బ్రవేశించిన వసంతసేనను సరిగ గుర్తించ లేక రదనిక యనుకొని తనకుమారుని లోపలఁ బరుండఁబెట్టి చూర్ణవృద్ధుఁ డొసంగిన యుత్తరీయమును జలి వేయకుండఁ గప్పుమని యామెచేతి కొసంగెను. వసంతసేనయు జాజిపూవులతావులఁ గ్రమ్ముచున్న యాయుత్తరీయమును నేను రదనికను గా నని తెల్పలేక చేతఁ బుచ్చుకొని చారుదత్తునియంగస్పర్శ మైనట్లు మహానందతరంగముల నోలాడుచు

లోపలికిఁ బోఁ దగనినిర్భాగ్యురాల నైతిఁ గదా యని విచారించుచు మాఱు వల్కక చిత్రప్రతిమవోలె నట్లే నిలువఁబడి యుండెను. చారుదత్తుఁడు పరిజనముగూడఁ దాను చెప్పినమాటలు వినకుండునంతటిదుర్భరస్థితికి వచ్చితిని గదా యని విచారించుచుండెను.

మైత్రేయుఁడును బలికర్మ యథోచితముగ నిర్వర్తించి తిరిగి వచ్చి విచారించుచున్న చారుదత్తుని గాంచి యామె రదనిక గాదనియు, వసంతసేన యనియుఁ దెల్పి వీధియందు జరిగిన వృత్తాంత మంతయు నెఱిగించెను. కొంతసేపు వార లన్యోన్యభావతరంగక్షుభితమనస్కులై మాట లాడలేకపోయిరి. తరువాతఁ జారుదత్తుఁడు తెలియక పరిచారికకుఁ జెప్పవలసినపనికి నియోగించితి నని వసంతసేనను క్షమింపు మని వేఁడుకొనెను. ప్రదోషసమయమున ననుచితవేషముతో వీథి కెక్కినందులకుఁ దానే క్షమ్యురాల నని వసంతసేన యనెను. పిదప నొకరికొక రభివాదనములు చేసికొనిరి. ఈసమావేశమూలమునఁ జారుదత్తునకు వసంతసేనపైఁ బ్రేమ యంకురించెను. అదివఱకే ప్రేమించి యున్న వసంతసేన కాతనియందు వలపు ద్విగుణీకృత మయ్యెను.

ప్రొద్దు పోవుచున్నది కావున నిఁక నింటికిఁ బోవుట యుక్త మని తలపోసి రాత్రిసమయమున రాజమార్గమున నొంటరిగఁ బోవుట భయహేతువు కాన సువర్ణభాండ మును తనన

భద్రముగ దాఁచి యుంచవలయు నని చారుదత్తునిచేతి కామె దాని నొసంగెను. కూడ సాయము పోవఁ దలంచి చారుదత్తుఁడు రాజమార్గములోఁ బెద్దమనుష్యులు తీసికొనిపోఁ దగిన దీపమును దెమ్మని వర్ధమానకున కాజ్ఞాపించెను. సేవకుఁ డగువర్ధమానకుఁడును బ్రతి చెప్పనేరక దబ్బంతయు నపహరించి కాముకుల నావలకుఁ బాఱద్రోలు భోగములంజెలవలె దీపములన్నియును స్నేహశూన్యము లయ్యె నని విచారింపసాగెను ఇంతలో దైవానుగ్రహము వలన గ్రహగణముతోఁ గూడ రాజమార్గప్రదీపమో యనునట్లు చంద్రుఁ డుదయింపఁ బలపలని పంకమునందుఁ బడుపాలవలె నాతనికాంతి చీఁకటులయందుఁ బడసాగెను. చారుదత్తమైత్రేయు లిరువురును వసంతసేన నింటివఱకు సాగనంపి మఱలి వచ్చి యామె తమచేతికి దాఁచ నిచ్చినసువర్ణభాండమును బవలు వర్ధమానకుఁడును రాత్రుల మైత్రేయుఁడును జాగ్రత్త పెట్టుటకు నిర్ణయించుకొనిరి.

మృచ్ఛకటికము.

ద్వితీయ ప్రకరణము.

అనంగదేవుని యాదేశము క్రమముగా వసంతసేన కౌదల కెక్కినది. చారుదత్తసంస్మరణము తప్ప నన్య మేమియు నామెకు రుచింప దయ్యెను. స్నానము జేసి దేవతాపూజఁ జేసికొమ్మని కబు రంపినతల్లి కీనాఁడు నేను స్నానము చేయను. బ్రాహ్మణులుచేతనే పూజఁ జేయింపు మని సమాధాన మిచ్చి చెలికత్తె యగుమదనికతోఁగూడఁ జారుదత్తుని గూర్చి యిష్టాగోష్ఠిగ మాట లాడుచుఁ గూర్చొని యుండెను.

అపుడు వారి కీక్రిందివిధముగ సంభాషణ ప్రవర్తించినది.

మద—అమ్మా! చారుదత్తుఁడు దరిద్రుఁడు గద వాని నెట్లు వలచితివి?

వసం—దరిద్రుఁడైన నేమి? ఆమహామహునిగుణగణములను జూచి వరించనివా రెవ్వరు?

మద—పూవులు లేనిమామిడిచెట్టుమీఁది కాఁడ తుమ్మెదలు పోవునా ?

వస—అవి మధుకరులు కావునఁ బోవు.

మద—చెలీ ! అంతటివల పున్న వానిసే యిచటికి రప్పించు కొనలేకపోయితివా ?

వసం—ఆలోచింపకుండ నేకార్యమును జేయరాదు.

మద—నీకు సందేహ మెందులకు ? ఎంతేమందివారకామినుల యిండ్ల కెందఱువిటు లిట్లు వచ్చుచుండుట లేదు.

వస—ప్రత్యుపకారము జేయఁజాల ననుసందేహముతో నామహాభావుఁడు కంటికే కానుపింపఁ డేమో ?

మద—అదియును నిజమే !

ఇట్లు వా రిరువురును బ్రస్తావించుకొనుచుండ మాథురుఁడనుసభికునితోడను నింకొక జూదగానితోడను, జూదమాడి సంవాహకుఁ డనువాఁ డొకఁడు వారికిఁ బదిసువర్ణము లప్పుపడి పాఱిపోవుచుండెను. మాథురుఁడును జూదగాఁడును

గీ. జూదరికొలంబునకునెల్ల వాదుదెచ్చి
పాఱిపోయెద వేలరా పాపి ! భీతి
నొడలువడఁకగ నింక దురోదర గృహ
మునకుఁ జనుదెంతె సభికుని మోసపుచ్చి.

అని కేకలు వేయుచు, వానిని బట్టుకొనుటకు వెన్నంటిరి.

సంవాహకుఁడు భయపడి వారిబారినుండి తప్పించుకొనుట కెదు రుపడకతో నొక శూన్యదేవాలయమునఁ జొచ్చి యం దున్న విగ్రహముపెనుక దాఁగి యుండెను. సంవాహకుని దఱుము కొని వచ్చుచున్న యాజూదరు లిరువురుఁగూడ నాశూన్యదేవా లయమును బ్రవేశించి యం దాతఁడు విగ్రహమువెనుక దాఁగి యుండుటఁ బసికట్టి వాని నవలకు లాగునుద్దేశముతో మరల జూద మాడ నారంభించిరి. సంవాహకునకుఁ బాచికలరొద యావేశముఁ గల్గించెను.

గీ. రాజ్యమును గోలుపోయిన రాజుమనము
భేరికాధ్వని వోలెఁ గంపింపఁజేయు
నాస పుట్టించి జూదంబు నందు ధనము
చెడినవానికి మరలఁ బాచికలరొదయు.

గీ. పైఁడికొండనుండి పడద్రోయు నెక్కించు
జూద మెప్పు డాడ రాదటంచు
నొట్టు పెట్టుకొనియు నుడుఁగఁడు కోకిలా
రవముఁ బోలు నక్షరవము విన్న.

కొంత కాలమువరకు నీవలకు రాకుండ మనస్సును బిగించు కొనెఁ గాని సంవాహకుఁ డిక నాసక్తి నణఁకొనలేక పోయెను. వా రిర్వురును బందెముల నొడ్డుచుండ సంవాహకుండు నీదియుఁ గాదు నీదియుఁ గాదు నావి పందె మనుచుఁ బరువెత్తుకొని

వచ్చెను. అంతట వారిరువురును సంవాహకుని బట్టుకొని యీయవలసినపదిసువర్ణముల కొఱకు నిర్బంధించి పలువిధముల బాధ పెట్టఁ దొడఁగిరి. ఇంతలో దర్దురుఁ డను నింకొక సభికుఁడు సంవాహకునియవస్థ గాంచి కొంచెము జాలి వడియెను.

ఉ. కిమ్మనకుండ పీఁకు తల క్రిందుగఁ జెట్లపయిన్ భయమ్మునన్
గొమ్మలలోన డాఁగెఁ బడఁ గ్రుద్దినఁ గాయలు కాచెవీపు
నిక్కమ్ముగఁ బిక్కలందు శునకమ్ములచేఁ గఱపించి రిన్నిభం
గమ్ములు డబ్బుకై పడియు, గ్రమ్మఱ వచ్చెను జూద మాడఁగన్.

అని చింతించుచుఁ దానుగూడ నట్టియవస్థ కిదివఱ కనేకసారులు పాల్పడి యున్నవాఁ డగుటచే సంవాహకు నెట్లైన రక్షింపఁ దలఁచి మాథురుని యొద్దకుఁ బోయి యనేకవిధముల బ్రతిమాలుకొనియెను. కాని మానుసుఁడు వినిపించుకొనలేదు. అందుచే వానితో గలహముఁ బెంచి యీసందున మాథురునికన్నులలో నిసుక జల్లి పాఱిపొమ్మని సంవాహకునకు సంజ్ఞ చేసెను. సంవాహకుఁడును జెప్పినట్లే చేసి తనప్రాణములను రక్షించుకొనుటకై వసంతసేనయింటికి దారితీసెను. దర్దురకుఁడు ప్రధానసభికునితోఁ గలహముఁ దెచ్చిపెట్టుకొనుటచే నచట నిలుచుట యపాయకర మనియు నార్యకుఁ డను గొల్లపిల్లవాఁ డొకఁడు మం దురా జగు నని సిద్ధుఁ డొకఁడు తెల్పుటచేఁ దనవా రంద ఱాగో

పాలబాలు నాశ్రయించుచుండి రనియు నందువలనఁ దాను గూడ వానియొద్దకే పోయెద ననియు నిష్క్రమించెను.

సంవాహకుఁడును మెల్లఁగ వసంతసేనయెదుటకుఁ బోయి భయకారణము నెఱుఁగనియామెతోఁ దాను పుట్టినది పాటలీపుత్రమనియు సంవాహకవృత్తిచే జీవించుచు నార్యచారుదత్తుని యొద్ద గొలువునకుఁ గుదిరి మంచినీళ్ల చెఱువులో నీళ్లు మిగులని పగిది నాతనిధన మంతయుఁ బోయి దరిద్రుఁడైన నాతఁడు వాత జూదమును జేపట్టి యదృష్టము లేమిచేఁ బదిసువర్ణము లప్పు వడితి ననియు వారు తీర్చవలయు నని నిర్బంధించి బాధించుచుండుటచే నామెమఱుఁగుఁ జొచ్చితి ననియుఁ దెల్పికొనెను. వసంతసేనయు నొకయప్పుడు చారుదత్తుని సేవకుఁ డగుటచేఁ దన కాతఁ డాత్మీయుఁ డని తలఁచి సంవాహకుఁడే యిచ్చినట్లు జూదరుల కీయవలయు నని పదిసువర్ణముల క్రిందఁ దనచేతిమురుగు నొకటి తీసి మదనికచేతి కిచ్చెను. సంవాహకుఁడును గండము గడచినందుల కెంతయును సంతోషించి యిఁక ముందు జూద మాడ నని యొట్టు పెట్టుకొని బౌద్ధసన్యాసి నయ్యెద ననియు సంవాహకుఁడు బౌద్ధసన్యాసి యయ్యె ననుమాట మఱవవల దనియుఁ జెప్పి వసంతసేనకడ సెలవు గైకొని వెడలి పోయెను.

పిదపఁ గర్ణపూరకుఁ డను వసంతసేన మాపటీఁడు రథసముగాఁ బ్రవేశించి ఖుంటమోదకము కట్టుఁగొయ్యఁ బెకలించు

కొని మాపటిని బంపి విశృంఖలముగాఁ దిరుగుచుఁ గాళ్లచే ను
దొండముచేతను వికసించినపద్మమునువలె నుజ్జయినీపురము
నంతయుఁ బాడొనర్చుచుండ దానికిఁ బ్రారబ్ధవశమున నొక
బౌద్ధసన్న్యాసి యెదు రయ్యె ననియు నంతట నాయేనిక వాని
దండకమండులువులఁ బోనడంచి శీకరముల మొగమునిండఁ
జిమ్ముచు దంతములసందున వాని నిఱికించుకొని పోవుచుండ
జనులందఱును సన్న్యాసి చచ్చెఁ జచ్చె నను యాక్రందనము
లొనర్చుచుండఁ జెంత సంగడిలో నున్న తా నది యాలించి
యొకయినుపకోలను దెచ్చి దానిని బడమొత్తి సన్న్యాసిజీవము
లను గాపాడితి ననియుఁ దరువాత నాజనసమూహములో
నున్నయొకపుణ్యాత్ముఁడు తనదరికి వచ్చి యొడ లంతయుఁ దడి
వికొని యొక్కనగ యైనను లేకుండుటకు సిగ్గువడి పై నున్న
యుత్తరీయమును బహూమతి యొసంగినాఁ డనియుఁ దెల్పెను.
అంతటివదాన్యుఁడు చారుదత్తుఁడు తప్ప నింకొకఁడు లేకుండు
టచే నాయుత్తరీయము చారుదత్తునిదే యని వసంతసేన నిర్ణ
యించుకొని కర్ణపూరకునియొద్దనుండి లేనగ యొకటి తీసి
యిచ్చి యాయుత్తరీయమును విలిచి ప్రేమసూచకముగాఁ దన
యొడలిపైఁ గప్పుకొనెను. పిదపఁ జారుదత్తుఁ డింకను వీథియం
దేగుచుండెనేమో తనివారఁ జూడవలయు నని మనసికతోఁ
గూడఁ బ్రాసాదాగ్రభాగమునకుఁ బోయెను.

మృచ్ఛకటికము.

తృతీయ ప్రకరణము.

నాఁటిరాత్రి చారుదత్తమైత్రేయు లిరువురును రేభిలుని యింటికి సంగీతము వినుట కేగి నడిరేయి దాఁటిన పిమ్మట స్వగృహమ్మున కేతెంచిరి. సంగీతము సర్వజనరంజక మైనది. గానమాధుర్యమునకుఁ గఱఁగనివాఁడు రాక్షసావతార మని చెప్ప నొప్పును. సర్వసాధారణముగ నాలకాఁపరులు పాడు గాలిపాటలకే పశువులుగూడఁ జెవులుఱిక్కించుకొని యాలించు చుండును. శాస్త్ర మెఱింగినవాఁడై మనోరంజక మగుగాత్ర మాధురి గలరేభిలునిపాటకుఁ జారుదత్తమైత్రేయులు తన్మయు లగుట వింత కాదు. ఇంటి కేతెంచిన తరువాతఁ గొంతసేపటి వఱకుఁగూడ.

మ. ఎదుటన్ వర్తిలుకాంత పో విరహవహ్నిన్ గ్రాఁగుచో
గేహికిన్, మది కింపైనవయస్య సుమ్ము వలవంతన్గుందుచోఁ
గామికిన్, ముద మిచ్చున్ బ్రియవిప్రలబ్ధయయి వ్యామో

హించుచోఁ గాంతకున్, మదనాటోపము వెంచు నౌషధము
సుమ్మా యీగృహస్థాళికిన్.

అని గానమాహాత్మ్యమును వర్ణించుకొనుచు శయ్యాలపై నొఱిగిరి. వెనుకఁ జేసికొనినసమయముప్రకారము సువర్ణభాండమును దాఁచుట రాత్రులయందు మైత్రేయుని వంతు. అందుచేతఁ బగటు వర్ధమానకునిచేతికి దాఁచ నిచ్చినసువర్ణభాండమును మైత్రేయుఁడు పుచ్చుకొనెను.

శర్విలకుఁ డనుదొంగయొకఁడు వసంతసేన యొక్క దాసి యగుమదనికను ప్రేమించెను. కాని యామెను దాస్యమునుండి విముక్తి సేయుటకుఁ దగినధన మాతనియొద్ద లేదు. మదనికపైఁ గలవ్యామోహము తొలఁగఁద్రోయుటకు వీలుకానంత బలముగఁ దల కెక్కినది. ఆతఁ డేమి సేయుటకును దోఁచక చౌర్యముచే నెవరియింటనైనఁ దగుమాత్రము ద్రవ్యమును సంగ్రహించి వసంతసేన కాధన మొసంగి మదనిక నామె దాస్యమునుండి విముక్తి సేయునుద్దేశముతో నాఁటిరాత్రి చారుదత్తభట్టారకుని యింటికిఁ జేరుకొనియెను. ఆతఁ డాఱితేఱినదొంగ. వృక్షవాటికాసమీపమునఁ జుట్టు ప్రహరికిఁ గన్నము ద్రవ్వి లోనికిఁ బ్రవేశించి నాలుగిండ్ల ముంగిటిలోనికి దూఱుటకుఁ దగినకన్నముఁ ద్రవ్వనెంచి,

చ. తడిసినచోటు ప్రక్కదలఁ ద్రవ్వినఁ జప్పుడు కానిచోటు నె
వ్వఁడుగనుగొనిచోటు, సులభంబుగ సంధికిఁ బెద్దరూప మే

ర్వడఁ గలచోటు చౌడురలిరాలెడుచోటును మేలు స్త్రీలు క
న్పడని ప్రదేశమున్ మిగులఁ బాడగుమేడయుఁ గార్యసిద్ధికిన్.

అని తనగురువుగా రాదేశించినప్రకార మట్టిచోటు కన్నపెట్టుటకు సంతసించి, భగవంతుఁ డగు కనకశక్తి "పండిటిక లూఁడఁ దీయుము; పచ్చియిటికలు పగులఁగొట్టుము; మంటిముద్దలగోడ తడుపుము; బల్లలకూర్పు చీల్చు" మని నుడివి యుండుటచే నదియును బండిటికలగోడ కావున నిటిక లూడఁదీయుటకు నిశ్చయించుకొని యేడువిధము లగుకర్మమార్గములయందును బూర్ణకుంభనామధేయ మగుసారంగమును ద్రవ్వఁ బూనుకొనియెను. మున్ముందు చౌర్యవిద్యకు గురువు లగు కుమారకార్త్తికేయులకు నమస్కరించి యోగరోచన యనువిద్య తనకుఁ బ్రసాదించి యొరులకంటి కగుపడకుండ ననుగ్రహించిన యోగాచార్యగురు చరణారవిందములకు సాగిలి మ్రొక్కెను. కన్నముఁ గొలుచుట కుఁ గొలదారమును మఱచిపోయి నందుల కొక్కింత విసువు కొనుచు బ్రాహ్మణుఁడు కావున యజ్ఞోపవీతమును జూచికొని,

గీ. దీనిచేఁ దల్పుగడెలూడఁ దీయవచ్చు
దీనిచే సీల నగలకుఁ ద్రిప్ప వచ్చు
దీనిచేఁ గొల్వవచ్చు భిత్తికి సురంగ
దీనిచేఁ బామువిషమును దింపవచ్చు.

అని నిశ్చయించుకొని ప్రమాణ మేర్పఱచుకొని క్రమముగఁ

గన్నముఁ ద్రవ్వ నారంభించెను. ఒక యిటిక వరుస మాత్రమే మిగిలినది. ఇంతలోఁ బాము కాఁబోలు కఱచెను. విషము పైకెక్క సాగెను. ఓర్వలేనంత బాధ కలుగుచున్నను పైకి మాత్ర మొరులకుఁ దెలియు నను భీతిచే మూల్గనైన మూల్గక జందెమూడఁ దీసి వ్రేలికి గట్టిగఁ జుట్టుఁబెట్టుకొని విషబాధకుఁ దగిన చికిత్స గావించి మిగిలిన కన్నమును గూడఁ బూర్తి కావించెను. లోపలి దీపపువెలుఁగు పైకిఁ బ్రసరించుచుండెను. పైవారల కెవ్వరికిని దాను కాన్పింపకుండ జాగ్రత్తపడి లోనికిఁ బ్రవేశించెను.

చారుదత్తమైత్రేయు లిర్వురును నిద్రించుచుండిరి. కాని యీసంగతి రూఢిగ శర్విలకునకుఁ దెలియదు. అందుచే మొదట శరీరసంరక్షణార్థము తలుపులన్నియుఁ దెఱవఁబోయి యందొకటి కిఱ్ఱుమనుచుండుటచే నీళ్లు జల్లి వీపు తలుపున కానించి యుతక నెత్తివైచెను. అనంతరము చారుదత్తమైత్రేయులు నిజముగ నిద్రించుచుండిరో లేదో పరీక్షించి యిట్లు నిర్ణయించుకొనెను.

చ. గుఱకసమాంతరంబగుచుఁ గొంకక వెల్వడుఁ గంటిఱెప్పలుం
దఱుగవుహెచ్చు వింతయును దారకలల్లలనాడ వంగముల్
పఱచినశయ్యదాఁటి వికలత్వముఁ జెందిన విట్టులుండ ముం
దఱఁగల దీపకాంతి నయనంబులు సైఁచునె దొంగనిద్రకున్.

వారు గాఢనిద్రలోనున్నట్లు నిర్ధారణచేసికొనిన పిదప శర్విలకుఁ

డిల్లునాలుగుమూలలుఁ గలయఁజూచెను. తానేపనికై వచ్చెనో యందులకుఁ దగిన వస్తువులేవియు నాతని కంటికిఁ గాన్పించ లేదు. ఒక వైపువీణె, యొకవైపు మద్దెల, యింకొకవైపు పణవము, నొక మూలఁ బిల్లనగ్రోవి, యింకొక మూల దర్దురమునుగాంచి నాట్యాచార్యుని యిల్లై యుండునేమో యనియు నింటి గొప్ప చూచి మోసపోయితి నని యూహించి మరల ధైర్యము తెచ్చుకొని నాల్గుమూలలను విత్తులు జల్లి మొలకలెత్తుటను మొలవకుండుటచే ధనము భూగర్భితము కాలేదని నిశ్చయించుకొని శుద్ధ దరిద్రుని యింటికి నాగ్రహాచారమునకుఁ దగిన క్లేశించితి నని కుందుచు వెడలిపోవ నుద్యమించెను.

ఇంతలో మైత్రేయుఁ డెవఁడో దొంగ కన్నముఁద్రవ్వి యింటిలోఁ బ్రవేశించెఁ గావున నీ సువర్ణభాండమును నీవే దాచియుంచు మనుచుఁ గలవరించెను. శర్విలకుఁ డది యాలించి పరిహాసమునఁ గట్లాడుచుండెనేమో యని కోపగించి మైత్రేయుని జంప నుద్యోగించెను. ఇంతలోఁ జిరుగుదోపతి కొంగున ముడివైచుకొనుటచే దీపపుకాంతిలో ధగధగలాడుచున్న సువర్ణ భాండమును గాంచి "నిష్కారణముగ బ్రహ్మహత్య నొనర్పఁ బూనితిని ఛీ! తుల్యావస్థయుఁ దుల్యజాతియుఁ గల వీని బాధించుటెందుల" కని విరక్తుఁడై యింకొక యింటికిఁ బోయెద నని పోఁ బోవుచుండ మరల మైత్రేయుఁడు "మిత్రమా! నాకేమో భయము వేయుచున్నది. ఈసువర్ణభాండమును బుచ్చుకొనకున్న

గోబ్రాహ్మణులమీఁద నొట్టుసుమీ" యని పలవరించెను. శర్వి లకుఁడును గోబ్రాహ్మణుల మీఁది యొట్టు దాఁటరాని దని దీపమార్పివైచి చేతులు చల్లగానున్న వేమని మైత్రేయుఁడు ప్రశ్నింపఁ జేతులు చంకలలోఁ బెట్టుకొని వెచ్చఁజేసికొని సువర్ణభాండమును బుచ్చుకొనియెను. బ్రాహ్మణకుల మాతయనుఁ జీఁకటి పాలుగావించితి ననియుఁ జతుర్వేద పారంగతుఁడు నప్రతిగ్రహీతయు నగువాని కడుపునఁ బుట్టియు బోగముతొత్తగు మదనిక కొఱకుఁ గదా యిట్టి దుష్కార్య మొనర్చితిననియు,

గీ. నరుల కెల్ల మానాభిమానములఁ జంపు
లేమి కన్నను దైన్యంబు లేదు జగతిఁ
గూడ దంచును నిందించుకొనుచు మరలఁ
జేయుచుంటిని గటకటా చెట్ట నేఁత.

అనియుఁ జింతింపుచు శర్విలకుఁడు వచ్చినదారినే సువర్ణభాండమును బుచ్చుకొని మదనికాసందర్శన వాంఛ త్వరబెట్ట వేగముగ వెడలిపోయెను.

శర్విలకుఁడు వెడలిపోయిన కొంతకాలమునకు రదనిక లేచి తలుపులన్నియుఁ దెఱచియుండుటఁ జూచి దొంగయెవ్వఁడో కన్నముద్రవ్వి యింటిలోఁ బ్రవేశించె నని గగ్గోలొనర్చుచు నిద్రించువారిని లేపెను. సువర్ణభాండమును శర్విలకుఁ డెత్తుకొని పోయిన సంగతి నెఱుఁగక పాపము చారుదత్తుఁడు

ఉ. కన్నముఁ ద్రవ్వఁ దస్కరుఁ డొకండెవఁడో పొరుగూరి యా
తఁ డింౘు దున్న జనంబు స్వేచ్ఛగఁ బరున్న తెఱంగు నెఱుంగఁ
డా యెసంౘు, పన్నుల మన్న యాశమెయి వచ్చి శ్రమంపడి
యిల్లుఁ జొచ్చియున్, జిన్నతనంబు చేసి దయచేసెను చేసిన
చేత కేడ్చుచున్.

అని విచారింపఁ దొడఁగెను. మైత్రేయున కింతలోఁ గొంచెము బుద్ధిమాంద్యము వదలి "మిత్రమా! చారుదత్తా! రాత్రి నీ చేతికొసఁగిన సువర్ణభాండము భద్రముగ నున్నదా యని ప్రశ్నించెను సువర్ణభాండమును మైత్రేయుని తెలివితక్కువచే దొంగ లెత్తుకొని పోయిన సంగతి నంత తెఱింగిరి. వసంతసేన కేమి సమాధాన మిత్తునా యని కుందుచున్న చారుదత్తునితో మైత్రేయుఁడు దొంగ లెత్తుకొని పోయిన దానికి మనమేమి చేయుదు మనియెను కాని చారుదత్తుఁ డభిమానవంతుఁడు శుద్ధ దరిద్రుఁ డౌటచే భోగముదాని నగ నపహరించి యాపన్నుగడఁ బన్నెనని వదరుఁబోతులు తూలనాడుదు రనియుఁ

గీ. ఘాతుకుండగు విధి నన్నుఁ గలిమియెల్లఁ
బాపి కావించెఁ గాక జీవచ్ఛవంబు
నేఁడు శుద్ధచరిత్రంబు గూడఁ బాపె
బ్రతికియుండుట కింకేది పట్టు నాకు.

అనియు బిచ్చమెత్తి సంపాదించియైన వసంతసేన నగ వసంతసేన కీయవలయుననియుఁ జింతింపసాఁగెను.

ఈ సమాచార మంతయుఁ జారుదత్తుని యిల్లాలగు ధూతాంబ రదనికమూలముగా నెఱింగెను. ఈమెయుఁ జారుదత్తునకుఁ దగిన భార్యయే సౌశీల్యమునం దాతని కించుకయుఁ దీసి పోవదు. అంత నామె మైత్రేయుని బిలిపించి నాఁడు రత్నషష్ఠి యను నోము నోచుకొంటిననియు విభవము కొలఁది బ్రాహ్మణునకు దక్షిణ యీయవలయుననియుఁ జెప్పి తన మెడలోని రత్నహారము నొసంగెను. విదూషకుఁ డామె యభిప్రాయమును గ్రహించి రత్నహారమును దీసికొనిపోయి చారుదత్తున కొసంగెను. చారుదత్తుఁడు కష్టకాలమున బ్రాహ్మణి తన్నను గ్రహించి నందులకు సంతసించియు,

గీ. నిండు దురదృష్టమున దరిద్రుండనైన
నాకు దిక్కయ్యె నే స్త్రీధనంబు తుదకుఁ
బురుషుఁడే ద్రవ్యవతియైన పూవుఁబోఁడి
డబ్బు లేకున్నఁ బురుషుఁ డాఁడదియు సముచు.

అని విచారించి యెట్టకేలకు మైత్రేయుని బిలచి సువర్ణభాండమును నాదేనను మ్మకముతో జూదమునందోడి పోయితిని. కావున దానికిఁ బ్రతిగా నీ రత్నహారము నొసంగితినని వసంత

సేనతోఁ జెప్పి యీయవలయునని పలికి రత్నహారము నొసంగి పంపెను.

అనంతరము దొంగ త్రవ్విన కన్నమునుజూచి నల్గురును నాలుగు విధములఁ జెప్పి కొనకుండఁ గప్పించివైచి చారుదత్తుఁడు కాల్యకరణీయంబుల నిర్వర్తించి సంధ్య నుపాసింపఁ బోయెను.

మృచ్ఛకటికము.

చతుర్థప్రకరణము

మఱునాఁడు వసంతసేన చారుదత్తుని యందలి ప్రేమ నానాఁటికి హెచ్చగుచుండుటచేఁ గాలయాపనముకొఱ కాతని చిత్రమును జిత్రించుకొని మదనికతోఁగూడ నాచిత్రపటమును విలోకించుచు నయ్యది నిజముగ నార్యచారుదత్తుని బోలి యున్నదియు లేనిదియుఁ దర్కించుచుఁ గూరుచుండెను. శకారునకు వసంతసేన మీఁదిమోహము తగ్గ లేదు. తల్లిని వలలో వైచుకొనినయెడల నామె మెల్లఁగఁ గూతుమనముఁ ద్రిప్పగల్గు నని పదివేలరూప్యములు విలువ గలనగ నొకదాని నుపాయనముగ గవిసెన గప్పి యున్న బండియందుఁ బంపెను. వసంతసేన తల్లియు నది చూచి భ్రమసి చేటి నొకదానిని బిలచి యింతసొమ్మొసఁగు బాజుంగు మన కీజన్మములో లభ్యము గాఁడు. కావున దడయక బండియం దెక్కి సంస్థానకుని దర్శింపఁ బొమ్మని కూఁతునకుఁ గబురంపెను. చేటి వచ్చి తల్లియాజ్ఞ వసంతసేన కెఱింగించెను. వసంతసేన సాటిరోఁబోటులవంటిది కాదు కావు

నను, జారుదత్తునియందే మనస్సు లగ్నము చేసి యున్నది కావునను మండిపడి తాను బ్రతికియుండుట కిష్టమే నట్టి సందేశము లెన్నడును బాపవల దని చేటిద్వారా మరలఁ దల్లికి వర్తమాన మంపించెను.

తరువాతఁ జిత్రఫలకమును దనపడుకటింటిలో శయ్యపై నునిచి రమ్మని వసంతసేన మదనిక కాజ్ఞాపించెను. మదనికయుఁ జిత్త మని వెడలిపోయి యాపని నిర్వర్తించి యింతలోఁ దన మనోహరుం డగుశర్విలకుఁడు తనకొఱకు నగను దొంగిలించి వచ్చి వాకిటియందుఁ బొంచియుండుటఁ గాంచి వానితోఁ గలిసి మాటలాడఁ బోయెను. వసంతసేన యామె యెంతకాలమునకు రాకుండుటకును దా నొంటరిగా నుండుటకును విసివి యేమి చేయుచున్నదో స్వయముగఁ జూచివత్త మని బయలుదేఱెను. మదనికా శర్విలకు లిర్వురు నీక్రిందివిధమున రహస్యసంభాషణమ్మున మునిఁగి యుండిరి. అది చూచి తా నెదురుపడి వారిమంతనముల కంతరాయము కల్గించుట మంచిది కా దని వారికిఁ గనుపించనిప్రదేశమున నుండి వసంతసేన యాలింపఁ దొడఁగెను.

శర్వి—ప్రాణేశ్వరీ! కావలసినద్రవ్య మొసంగియెడల వసంతసేన నిన్ను దాస్యమునుండి విముక్తి సేయునా?

మద—ధన మెచ్చటనైన లభించినదా?

శర్వి—ఇదిగో! చూడుము. నీకొఱకే యీసువర్ణభాండమును బలుకష్టములు పడి సంపాదించితిని.

మద—అయ్యో! ఎంతపని చేసితివి. ఇది యెచ్చట దొరకినది?

శర్వి—ఇది నిన్నరాత్రి చారుదత్తునియింటికిఁ గన్నము త్రవ్వి సంపాదించితిని.

మద—ఆయింట నెవ్వరికి నేహానియు నొనరింపలేదు కద ?

శర్వి—ఈశర్విలకుఁడు బ్రాహ్మణవంశమున జన్మించినవాఁడు సుమా! నీ మీఁది మోహమున నిట్టి దొంగతనము నకైన నొడంబడియెను.

మద—నే నెఱుంగుదును. నీహృదయ మట్టిదే కాని నిజముగ నాయింట నున్నవారి కేవిధమగుహానియుఁ గలుగ కుండ నీ వీనగను సంపాదింపఁ గలిగితివా ?

శర్వి—అంతగ గ్రుచ్చియడుగుచుంటి వేమి ? ఇదిగో! యజ్ఞోపవీతముతోఁడు నావలన నెట్టియాపదయు వారికిఁ గలుగ లేదు.

మద—అట్లయినఁ జాల సంతసము. తుదకుఁ బ్రియమే సంభవించినది.

శర్వి—ఎందుచేత ?

మద—చారుదత్తభట్టారకున కేయాపదయుఁ గల్గకుండుటచేత?

శర్వి—ఈమె చారుదత్తుని వలచినది కాఁబోలును వృథా మోసపోయితిని.

గీ. వలపు నిలుపఁగరాదు కోమలులయందుఁ
బరిభవింతురు వలచినవారి స్త్రీలు

తరుణియే తన్ను వలచిన దానివలపు
నడఁపవలయును లేదేని గడఁపవలయు.

కం. సొమ్మిచ్చిన నవ్వింతురు
నమ్మింతురుగాని ప్రియుల నమ్మరు కులశీ
లమ్ములు గలవారికి రో
కొమ్మలు కట్టా స్మశానకుసుమము లీలా ?

మదనికా! నేఁటితో నీకును నాకును సరి నీ వెవ్వరిని వలచితివో వారినే యాశ్రయింపుము. ఇన్నివాళ్లనుండియు నీయందే వలపుంచినందులకు నాకుఁ దగినప్రాయశ్చిత్తమొన రించితివి.

మద—శర్విలకా! ఎందులకు వృథాసంబద్ధప్రలాపివై కోప గించెదవు. ఇందులోని రహస్య మంతయు నీ కెఱింగిం చెద ఈసగ వసంతసేనది.

శర్వి—చారుదత్తునియొద్ద నెందుల కున్నది ? ఈమెకు నాతనికి నేమి సంబంధము.

మద—నీ వెఱుఁగనే యెఱుఁగవా ? చారుదత్తుఁడు వసంత సేనకుఁ బ్రాణప్రియుఁడు. ఆనడుమ నొకనాఁడు వీధి యందుఁ దుంటరులచేఁ దఱుమఁబడి యాతనియింటిలోఁ దల దాఁచుకొని యర్ధరాత్రిసమయము మగుటచే నాభర ణము నాతనికి దాఁచ నిచ్చినది. చారుదత్తుఁడు వసంత

నేననుఁ బ్రియుఁ డగుటచే నాతని కేహానియుఁ గలుగకుం డుట ప్రియమే యనుకొంటిని. ఇంతమాత్రమున కే కోపమా ?

శర్వి—అట్లనా ?

గీ. ఎండవేఁడి సహింప లే కేనగంబు
నాశ్రయించితినో మున్ను విశ్రమింప
దానికొమ్మలనే పత్రహీనములుగఁ
జేసికొంటిని గటకటా ! చెట్టు నగుచు.

మద—ప్రియుఁడా ! జరిగినదానికి విచారించి మాత్ర మేమి ఫలము ? ఈదుష్కృత్యము వసంతసేన కనిపెట్టకుండ నేదేనుపాయ మాలోచించుకొనుము.

శర్వి—నా కేమియుఁ దోచుట లేదు. విపత్సమయముల సహజముగఁ బురుషులకంటె స్త్రీలే కుశాగ్రబుద్ధులు నీవే యిప్పుడు నన్ను గట్టెక్కింపవలయును.

మద—తగినయాపాయే తోఁడగట్టినది. నీవు చారుదత్తుని సంబంధివిగా నటించి యాతఁడు పంపినాఁ డనిచెప్పి యీనగ నామె కిచ్చి వేయుము.

శర్వి—సరియే ! నీవు ముందు నడువుము నేను ని న్ననుసరించియే వచ్చెదను.

వసంతసేన వీరిరాకఁ గనిపెట్టి యభ్యంతర మందిరము లోనికిఁ బోయెను. మదనిక శర్విలకుని వసంతసేన యెదుటఁ

బెట్టినతరువాత నాతఁడు "నాయిల్లు ప్రాఁతదగుటచే రక్షించుట కష్టముగా నున్నది. కావున నీసువర్ణభాండమును నీవే కాపాడు కొను మని చారుదత్తుఁడు నీ కీయాభరణము నిచ్చిరమ్మనియె నని చెప్పి సువర్ణభాండము నొసంగెను. వసంతసేనయుఁ దత్క్షణమే యీనగ నీ కెవ్వరు తెచ్చి యిచ్చిరో వానికి నీచెలికత్తె యగు మదనిక నొసంగి పెండ్లిచేయు మని నా కార్యపుత్రుని యాదేశ మని పలికి మదనిక నాతనివశము గావించెను. బండి సిద్ధము చేయించి వలయుకానుక లొసంగి యాదంపతుల నిర్వుర వీడు కొల్పెను.

మదనిక యాదార్యపతియుఁ గృపాఖనియు నగు నేలిక సానిని విడువలేనివిచార మొకవంకయుఁ జిరకాంక్షితభర్తృసమా గమనంతోష మొకవంకయు సందడింప శర్విలకునితోఁ బోవు టకు సిద్ధపడియెను. శర్విలకుఁడును వసంతసేనయొక్క యుదార వర్తనమును జారుదత్తుని నామమాహాత్మ్యమును నోరార నుతించెను.

గీ. మంచిగుణములు కల్గినమనుజునకు న
సాధ్య మగుకార్య మెుండునే జగతియందు
నట్టి ముక్కంటితలకుఁ బూ వగుట యెందుఁ
గారణము చందురుని గుణగణము గాదె?.

బండి రాజమార్గమునఁ బోవుచుండెను. పాలకమహారాజు సిద్ధుఁడు చెప్పినమాటలను విని యార్యకుఁ డనుగొల్లపిల్లవాఁడు

ముందు రాజగు ననుభయముతో నాతని జెరయం దుంచి నాఁడు కావునఁ బ్రజ లందఱు నప్రమత్తులై యుండవలయు ననియు నాతఁడు పాఱిపోవుటకుఁ దోడ్పడఁ దలఁచినవా రెవ్వరే నున్న యెడలఁ గఠినముగ దండింపఁబడుదు రనియు రాష్ట్రియుని సాటింపు వినవచ్చెను. శర్విలకున కార్యకుఁడు ప్రియస్నేహితుఁడు ప్రాణమునకుఁ బ్రాణము అట్టి యాప్తమిత్రు నకు సంభవించిన యాపదకు మొదట వగచి తరువాత ధైర్య ముతోఁ దొల్లి యుదయనుని యౌగంధరాయణుఁడు విడిపిం చినట్లు తా నార్యకుని దప్పక విడిపింతు నని దృఢప్రతిజ్ఞ సలిపి మదనిక నెట్టకేల కొప్పించి యామెను జాగ్రత్తగఁ దనమిత్రుఁ డగు రేభిలునియింట దిగఁబెట్టుమని బండివానితోఁ జెప్పి శర్విల కుఁడు తనప్రతిజ్ఞానిర్వహణంబునకై బయలుదేఱెను.

చారుదత్తునియొద్ద సెలవు గైకొని రత్నహారమును వసంతసేన కిచ్చుటకు మైత్రేయుఁ డామెయింటి కీసమయమునకే చేరుకొనియెను. చేటియొక్కతె దారిఁ జూపించుచుండ గోష్పీ చందనముతో నలంకరింపఁబడి యాకసము నంటుచున్న సింహ ద్వారముసాబగున కచ్చెరువు గాంచి పలువిధంబు లగుముగ్గు లతో నిండియున్న మొదటియంకణమును, గుఱ్ఱపుసాలలు, గుఱ్ఱములు నెద్దు తత్సంరక్షకులతో నిండి యున్న రెండవమొగ సాలయుఁ గులపుత్రకులు కూర్చుండుటకుఁ దగినవేత్రాసనం బులు పఱచియున్న మూఁడవమొగసాలయు వివిధగానాభినయ

నృత్యంబులు నేర్చికొనుచున్న గణికాబాలికలతోడను వారి యుపాధ్యాయులతోడను నిండియున్న నాల్గవచత్వరంబును గడచి వివిధము లగునంటకంబులను దయారుచేయుచుండుటచేఁ బైకి వచ్చుకమ్మనితాలింపువాసనలు గలపంచమప్రకోష్ఠంబును దాఁటు నపుడు నోరూరుచుండ నానాజాతులరత్నములను బరీక్షించు చుండినమణిపరీక్షకులకును గుండనపుఁబని సేయుచున్నకంసాలు లకును దావలమై సంకుల మగునాఱవమొగసాలయు శుకశారి కాదు లగుపలురకముల విహంగములకుఁ దత్పోషకవర్గమునకు నివాసస్థానమై యుండినసప్తమాంగణంబును గడచి యెన్మిదవ మొగసాలయందుట్టిఁ బెట్టిన గుమ్మడికాయవలెఁ బీఠముపైఁ గాళ్లు క్రిందకు వ్రేలాడుచుండఁ గూర్చొని యుండినవికృత స్వరూపిణి యగువసంతసేనతల్లిని జూచి నవ్వుచు నుద్యానవన మునం దొంటిగ నున్నవసంతసేనసమీపమును జేరెను.

వసంతసేన వచ్చినమైత్రేయుని గాంచి సంతుష్టాంతరంగయై నమస్కరించి యాసన మిచ్చి కుశలప్రశ్న మడిగి యనంతర మఱుదెంచినకార్య మే మని ప్రశ్నించెను. మైత్రేయుఁ డంతటఁ జారుదత్తుఁడు సువర్ణభాండము తనదే నను నమ్మకముతో జూద ములో నోడిపోయె ననియు గెల్చినవాఁడు రాజుగారిచారుఁ డెచ్చటి కేగెనో తెలియనందున దానికిఁ బ్రతిగ నీరత్నహార మును బుచ్చుకొను మనినాఁడనియుఁ దెల్పి తాను తోడ్కొని వచ్చినరత్నహార మెదుటఁ బెట్టెను. వసంతసేన జరిగిన దంతయు

నెఱిఁగియున్నది కావునఁ జారుదత్తుని శీలమున కబ్బురపడుచుఁ బువ్వులు రాలిపోయిన మామిడిచెట్టునకు మకరందబిందువు లెచ్చటి వని నవ్వుచుఁ బ్రశ్నించి నేను బ్రదోషసమయమున దర్శనమునకు వత్తు ననియాజూదగానితోఁ దెల్పవలయునని మైత్రేయుని గోరెను. మైత్రేయుఁ డట్లే యని సమ్మతించి యామెకడ సెలవు గైకొని విచారముతో రత్నావళిమాల్యము సువర్ణభాండమునకు సరిపోయినది కాదుకాఁబోలును మరల నీభోగమునది సాయంసమయమున వచ్చెదనని కబురంపినది. తగవు బెట్టునేమో ఆదరిద్ర చారుదత్తుఁ డెచ్చటినుండి తెచ్చియిచ్చునో ఎంతటి శీలవంతులకును భోగమువారలతో స్నేహము ప్రమాదమునకుఁ గారణముకాక తప్పదనుకొనుచు నింటిమొగము పట్టెను.

మృచ్ఛకటికము.

పంచమ ప్రకరణము

చారుదత్తుఁడు నాటిసాయంసమయమున గృహారామమునం దెండిపోయిన చెట్లగుంపుమధ్య నాలోచించుకొనుచు మేఘావృత మైనయాకసము యొక్క విలాసములఁ దిలకించుచుండెను.

సీ. కలసినచక్రవాకంబులగతిఁ దెక్క
లల్లార్చి యెగురురాయంచ లట్లు
జలములోఁ దిరుగుచేపలకీతి జనపరి
భ్రాంతంబు లగుమకరముల పగిదిఁ
గమనీయశృంగజంగమసౌధముల భాతిఁ
బరుగిడు చున్నయశ్వముల చాయ
ముట్టి పై కెత్తినలొట్టిపిట్టల మాద్రిఁ
గ్రమముగాఁ బోపుపుల్గుల విధమున
గీ. వాయువిశ్లేషితంబులు వారివాహ
ఖండములు పెక్కురంగులు గలవి నడువఁ

జనలు భాసిల్లుచున్నది చారుచిత్ర
రచనఁ గన్పించు దొసంగువస్త్రంబు పగిది.

గీ. ఆంబికేయుఃయూననం బయ్యె మిన్ను
పొంగుచుండెను రారాజు పోల్కి నెమలి
యొడ్డెధర్మజుఁ డోడినజాడఁ బికము
డాఁగె రాయంచగములు పాండవుల పగిది.

మైత్రేయుఁడు వసంతసేనయొద్దనుండి సరిగ నీసమయమున కే తిరిగివచ్చి రత్నావళిఁ బుచ్చుకొని చెలికత్తెలకుఁ గంటి సైగఁజేసి మొగము పైటచాటునఁ బెట్టుకొని తన్నపహసించి నదనియు రత్నావళి చాల దని తగవుబెట్టుటకుఁ గాఁబోలు సాయంకాలము మీజూదగానిని సందర్శింతు నని తెలుపుమని దనియుఁ జెప్పి పెక్కుసిలుఁగుల కాకరముగావున గణికావ్యామోహము నీకనైనఁ గట్టిపెట్టుట మంచి దని చారుదత్తునకుఁ బరిపరివిధముల బోధించెను. వేశ్యాసంగమము దుఃఖకారణ మను విషయమును బెడచెవిని బెట్టి రత్నావళి చాల దని తగవు బెట్టుటకే వచ్చునెడల నామె సంతసించుచుఁ బోవఁగలదు లే యని మైత్రేయునకు సమాధాన మొసంగి మఱింతయుత్కంఠ హెచ్చ నేదియో యాలోచించుకొనుచుఁ జారుదత్తుఁడు కాలక్షేప మొనర్చుచుండెను.

అంతట మేఘములు క్రమముగా వర్షింపసాగెను. వసంతసేనచేఁ బంపఁ బడినకుంభీలకుఁ డనుచేటుఁడు ముందు వచ్చి

యుద్యానవనముతల్పు మూయఁబడి యుండుటచే దూరముగా నున్న మైత్రేయు నొక మంటిబెడ్డతోఁ గొట్టి తల్పు దీయించుకొని చారుదత్తునితో వసంతసేన వచ్చుచున్న దని తెల్పి పైఁగప్పుకొనిన యుత్తరీయమును బహుమతిగాఁ బడసి పోయెను. వర్షము క్రమక్రమముగా హెచ్చసాగెను. అంతకుముం దటునిటు సంచరించుచుండిన మేఘము లొక్కచోటనే నిలువఁబడినవి. స్వర్ణకుంభములు గట్టినవారణము లట్లు విద్యుత్తుతోఁ గూడి తిరుగాడుచుండినయంబుదములను వెండిగొలుసులతో నింద్రుఁడు లాగించుచుండెనో యనునట్లు వారిధారలు వర్షించుచుండెను. కృతఘ్నునియం దుపకారము పోలికగాఁ దారక లంతరించెను. వివిధప్రమదాజనము లట్లు దిగ్వారము కాంతి వాసెను. సురేశ్వరాయుధాగ్నిచేఁ దప్తమై యంబరము ద్రవాకారముఁ జెంది నీటిరూపునఁ గ్రిందఁ బడుచున్నదో యనునట్లుండెను. జనసంచారము పూర్తిగఁ దగ్గిపోయినది ఇట్టి సమయమున నుజ్జ్వలాభిసారికా వేషముతోఁ ఛత్రమును దాల్చి వసంతసేన విటుఁడను నాత్మీయునితో ముచ్చటించుకొనుచు చారుదత్తుని గృహాంగణమునకు బయలుదేరెను.

గీ. ఉఱుముఁగాక పయోదముల్ కుఱియుఁగాక
పిడుగు పడుఁగాక యగుఁగాక పుడమి కదలి
చలియు వేడియుఁ జూడరు లలన లకట!
రమణుసాన్నిధ్యమున కేగుసమయ మందు.

వసంతసేన చారుదత్తునిగృహారామమును జేరి కూడ వచ్చినవిటుని ఛత్రధారికచే గొడుగుపట్టించుకొని యింటికిఁ బొమ్మని పంపివైచి మైత్రేయుని మీజూదగాఁడెచ్చట నున్నాఁడని ప్రశ్నించి యాతఁడు త్రోవఁజూపుచుండఁ జారుదత్తుని సమీపించెను.

వసం—జూదగానికిఁ బ్రదోషసమయము సుఖకరమేనా ?

చారు—సంధ్య జాగ్రదవస్థయందును దమి యూర్పులు పుచ్చుటతోడను తరలుచున్నవి ఇఁక నీరాకచే మాత్రము సంధ్య సుఖప్రదము కాఁగలదు నీకుఁ గుశలమా ?

వసం—తమదయవలన.

మైత్రే—ఈయంధకారసమయమున నేల వచ్చితివి. ఇప్పుడు రాకపోయిన నేమి ?

చేటి—అయ్యా ! మైత్రేయ ! మీరుతీసుకొనివచ్చి యిచ్చిన రత్నహారమును మాయేలికసాని తనదే యనునమ్మకముతో జూదమునందోడిపోయినది. గెలిచినవాఁడు రాజచారుఁడు వాఁడెచటకుఁబోయెనో తెలియవచ్చుట లేదు ఆతనియునికి తెలియవచ్చునంతవరకు నీసువర్ణభాండమును మీయొద్ద నుంచుఁడు.

చారు—మిత్రమా ! ఇది యేమి ? ఇది చోరుఁడు దొంగిలించిన సువర్ణభాండమే కాదా ?

చేటి—అయ్యా! శర్విలకుఁ డనుదొంగ మామదనికను ప్రేమించి యామెను దాస్యమునుండి విడిపించుటకుఁ జాలినంత ధనము లేమిచేఁ బాపకృత్యమునఁ గొడిగట్టినాఁడు.

వసం—ఆర్య! చారుదత్త! ఈరత్నావళి ధరించుటకుఁ దగిన యోగ్యత నాయొద్ద లేదు. పరమపవిత్ర మగు మీకుటుంబము ధరించుదానిని నే ముట్టుకొనుటకైన సమర్థురాలనుగాను. కావున దీనిని మీరు మరలఁ గైకొనుడు.

చారు—సఖి! వసంతసేన! నేను పంపుటకుఁ దగినకారణము లేక పోలేదు. దరిద్రుఁడగు చారుదత్తపాతకుఁడు బోగముదానినగ నపహరించె నని లోకు ల డిపోయుదురు. ఆయపవాదమునకు భయపడి స్త్రీధనం బనియైన యెంచక నీకుఁ బంపితిని ఒకమా రిచ్చిన దానిని మరలఁ బరిగ్రహించు నంతటి నీచుఁడు మాత్రము నీప్రియుఁడు కాఁడుసుమా!

వసం—ఇంత సుగుణవంతుఁడ వౌటయే నిన్నుఁ గామించుటకుఁ గారణము. పిదప వార లిరువురు నన్యోన్యానురాగ పరిణామమును గూర్చి యిఁక కొంతతడవు ముచ్చటించుకొని మైత్రేయుని జేటిని వీఁడుకొల్పి యభ్యంతరగృహమ్మునకుఁ బోయిరి.

మృచ్ఛకటికము.

షష్ఠ ప్రకరణము

తెల్లవాఱినది. నిద్రనుండి లేచి చారుదత్తుఁడు బండి పూన్చి పుష్పకరండకజీర్ణోద్యానములోనికి వసంతసేనను దోడి తెమ్మని వర్ధమానకునకుఁ జెప్పి తా నచ్చటికిఁ బోయెను. వసంతసేన నిద్దుర లేచి కాలకృత్యములు నిర్వర్తించుకొని చారుదత్తుఁడు పుచ్చుకొనక పోవుటచే రత్నావళిని ధూతాంబకే యీయఁ దలంచి యామెయొద్దకుఁ బోయెను. ధూతాంబయు నార్యపుత్రుఁడు నీ కనుగ్రహముగా నిచ్చినదానిని మరల నేను గ్రహింప నోపనని నిరాకరించెను. భర్తకుఁ దగిన భార్యయు భార్యకుఁ దగినభర్తయు దొరకుట దుర్ఘటమని వారిదాంపత్యమున కచ్చెరువు నొందుచు వసంతసేన మరలివచ్చుచుండెను.

పొరుగింటి సంపన్నుల బాలకుఁ డొకఁడు సువర్ణశకటితో నాడుకొనుచుండెను. అది చూచి చారుదత్తుని కుమారుఁడు నాకుఁ గూడ నట్టిబండి కావలయు నని పట్టుబట్టెను. రదనిక మట్టిబండి నొకదానిని చేసియిచ్చెను. కాని యాతఁ డేడుపు

మూనలేదు. పూర్వ మొకప్పు డైశ్వర్య మనుభవించిన వాని పుత్రుఁ డీగతి నేడ్చుచుండుటకు రదనిక మిగుల విచారించి విపరీతకాలమును దెచ్చిపెట్టినభగవంతుని చెయిది నిందించుచు నాయనా! మీతండ్రిగారికి మరల నైశ్వర్యము వచ్చినప్పు డిట్టి దానితో నాడుకొనవచ్చునులె మ్మని యోదార్చుచుండెను. ఆమె వసంతసేనను జూచి బాలకు నామెయొద్దకుఁ దీసికొని వచ్చెను. మూఁడుమూర్తులఁ జారుదత్తు ననుకరించు చున్న యాబాలకుని దగ్గఱకుఁ దీసికొని యాతఁ డింకను సువర్ణశకట ముకొఱ కేడ్చుచుండుటఁ గాంచి వాని నోదార్చుటకై తన మేని సొమ్ముల నొలిచి వీనితో బంగారుబండి చేయించుకొను మని పల్కి యానగలు మట్టిబండిలోఁ బడవైచెను. రదనిక బాలకుని వెంటఁ బెట్టుకొని యానగలతోఁ గూడ వెడలి పోయెను.

వర్ధమానకుఁడు బండిని పూన్చి తీసుకొని వచ్చెను కాని వసంతసేన యింకను దననేపథ్యము బూర్తి గావించుకొనలేదు. ఇప్పుడే వచ్చెదనని యలంకరణము బూర్తిగావించుటకై యామె లోనికిఁ బోయినది. వర్ధమానకుఁడు బండిలోని యాస్తరణము మఱచి వచ్చెను ఈలోపుగ నది తెచ్చుకొన వచ్చుఁ గదా యని యెంచి ముక్కులకుఁ ద్రాళ్లు వేసిన పొగరుగిత్త లచ్చట నొంటిగ నిలువవుగావున బండికూడఁ దోలుకొని పోయెను.

రాజస్యాలకుఁ డగుశకారుఁడు పుష్పకరండకజీర్ణోద్యానమునకుఁ దనబండిని దోలుకొనిరమ్మని స్థావరకుని నియోగించెను. అతండును బండి పూన్చి చారుదత్తునియింటివైపు తీసుకొని వచ్చుచుండ సరిగ నాతని యింటిగుమ్మము వద్దకు వచ్చునరికి దారిలో నింకొకబండి చక్రములు జారిపోవుటచే నాబండివాఁడు చక్రములను మరలఁ దగుల్చుటకుఁ బాటుపడుచుండెను. స్థావరకుఁడు తనశకటము నాపి వానికి సాయముఁ జేయఁ బోయెను. వసంతసేన యలంకరణము పూర్తి గావించుకొని వీధిలోనికి వచ్చి యాఁగి యున్నబండి వర్ధమానకుఁడు తనకొఱకుఁ దీసికొని వచ్చినదే యనుకొని యం దెక్కెను. స్థావరకుఁడు తా నేగినపని పూర్తియైన వెంటనే వచ్చి బండియం దెవ్వరున్నదియును జూచుకొనకుండఁగనే శకటమును దోలుకొని పోయెను.

మిత్రుఁ డగుశర్విలకుఁడు ప్రతిజ్ఞానిర్వాహణ మొనర్చి చేసినసాహాయ్యమువలన గోపాలదారకుఁ డగునార్యకుఁడు చెరసాలనుండి తప్పించుకొని యొకకాలియందు సంకెల గలగలలాడుచుండఁ దొందరగా నలువైపులనుండియుఁ దన్ను బట్టుకొన వచ్చుచున్న రాజభటులబారినుండి తప్పించుకొనుటకై పఱువెత్తుకొనివచ్చుచుఁ జారుదత్తభట్టారకునింటితలుపు తెఱచియుండుటచే నందుఁ బ్రవేశించి డాఁగియుండెను. ఇంతలో వర్ధమానకుఁడు బండిలోనియాస్తరణముఁ జక్కబఱచుకొని

బండి తీసికొనివచ్చి వసంతసేనకొఱకుఁ గేకవైచెను. ఆర్యకుఁడు మిగుల సంతసించి బండివెనుకనుండి వచ్చి యం దెక్కెను. సంకెలలగలగల విని వర్ధమానకుఁడు నూపురధ్వని యనుకొని వసంతసేనయే శకటమధిరోహించె నని నమ్మి తోలుకొని పోవసాగెను.

చందనకవీరకు లనునిరువురు రాజభటులు రాజమార్గమునవచ్చుచుఁ బోవుచున్న శకటములఁ బరీక్షించుటకై నియోగింపఁబడిరి. వా రతిజాగ్రత్తగఁ బరీక్షించుచు రాజమార్గమున వచ్చుచున్న చారుదత్తుఁబండి నీక్షించిరి.

చం — ఈబండి యెవ్వరిది ?

వర్ధ — అయ్యా ! ఇది చారుదత్తభట్టారకునిది. ఇం దధివసించి వసంతసేన పుష్పకరండకజీర్ణోద్యానమున కాతని గలసికొనఁ బోవుచున్నది.

చంద — బండి నాపుము. వీరకా ! నీ వేగి యం దెవ్వరున్నారో పరీక్షింపుము.

వీర — నీవే చూడుము. నీవును రాజుగారిసేవకులలో నమ్మకమైనవాఁడవే.

తుదకుఁ జందనకుఁడే బండిని బరీక్షించుటకు నిశ్చయమయ్యెను. కాని దించినతరువాతఁ జందనకుఁడు చూచునరికం దార్యకుఁ డను గొల్లపిల్లవాఁడు కాన్పించెను. ఆర్యకుఁడు సమయము మించివచ్చినందులకు విచారించి తుదకు ధైర్యము

వహించి మస్తకన్యస్తాంజలిపుటుండై చందనకునితో నిట్లనియెను.

ఆర్య—అయ్యా! శరణాగతుఁడను నాకుఁ బ్రాణభిక్ష పెట్టుఁడు.

గీ. పరుల కుపకార మొనరింపఁ బాటుపడెడు
వాఁడు శరణాగతత్రాత కీడుజెందు
నేని జెందునుగాక తాదృశుని లోకు
లెన్నఁడుఁరుగాని నిందింప రిందు నెందు.

చం—సరియే నీకు వచ్చినభయ మేమియును లేదు లెమ్మా.

వీర—చందనకా! అంతసేపు పరీక్షించుచుంటి వేమి?

చం—ఏమియును లేదు. ఆర్యుని జూచితిని కాదు కాదార్య చారుదత్తు నభిసరింపఁబోవుచున్న వసంతసేనను జూచితిని.

వీర—తడఁబడుచుంటి వేమి?

చంద—మాట తొట్రుపాటు ఇం కేమియును లేదు.

వీర—నేనుగూడఁ జూడవచ్చునా?

చంద—నేను పరీక్షించినతరువాత నీవుగూడ నెందులకు?

వీర—కాదుకాదు నా కనుమానముగా నున్నది.

చంద—ఏమి? నామాటలయందు నీకు నమ్మకమే లేదా?

వీర—నమ్మకము లేకపోవుట కాదు. రాజుగారికి నీ వెంత విశ్వాసపాత్రుఁడ వగుసేవకుఁడవో నేను నంతవిశ్వాస పాత్రుఁడనే.

చంగ—నేను పరీక్షించినబండి మరలఁ జూచుటకు నీ వెవ్వాఁడవురా!

వీర — నీ వెన్ని చెప్పినను నేను విడుచువాఁడను గాను.
మొదటఁ దడఁబడుటయు దరువాత నన్ను వలదనుటయు
నాకు సందేహమును వృద్ధిసేయు చున్నవి.

అనుచు బండిదగ్గఱకు వచ్చినవీరకుని జుట్టు బట్టుకొని తన్ని యీజోలికి నీవు వచ్చితివే నిఁక నీప్రాణములు దక్కవు జాగ్రత్త యనిచందనకునిపై నాగ్రహించి వీరకుఁడు రాజసభకుఁ బోయి దీనికిఁ దగినప్రతిక్రియ సేయుదు నని వెడలిపోయెను. చందనకుఁడును వీరకునిపీడ వదలిపోయినందులకు సంతసించి శకటము నెవ్వరే నాపినచో మేము పరీక్షించితి మని చెప్పు మని వర్ధమానకున కుపదేశించి తనచేతియం దున్న ఖడ్గము నాత్మసంరక్షణార్థము గోపాలదారకున కిచ్చి వ్యాజముగా వసంతసేనా! సంపదలు కల్గిననాఁడు నీమిత్రుఁడ నగు నన్ను మఱచిపోవకుముసుమా యని హెచ్చరించుచు వెడలిపోయెను.

గీ. కత్తి చేతికి దొరకెను గంపమాన
మయ్యె దక్షిణభుజము భయమ్ము లేదు
సర్వ మనుకూల మగు నింకఁ జందనకుని
మితికిమీఱినదయ చేత బ్రతికినాఁడ.

అనుకొనుచుఁ జందనకుని దయాతిరేకమునకుఁ గృతజ్ఞతాపూర్వకవందనంబు లాచరించి యార్యకుఁడు బండియందు క్షేమముగ నావలకుఁ దాఁటెను.

మృచ్ఛకటికము.

సప్తమ ప్రకరణము

పుష్పకరండకజీర్ణోద్యానమున వసంతసేనరాక కెదురు చూచుచుఁ జారుదత్తమైత్రేయు లిరువురు నుద్యానశోభను సంతసించుచుఁ గూర్చుండియుండిరి కాని యెంతసేపటికిని వసంతసేనజాడ కాన్పింపలేదు. చారుదత్తున కుద్వేగ మధికము కాఁజొచ్చెను. దారియందు బండిచక్రము లేజారిపోయెనో బిగించిన తల్ళులే తెగిపోయెనో రాజచారులు శకటము నడ్డిరో లేక శకారాదులు మధ్యమార్గమునఁ గానుపించి బాధపెట్టుచుండిరో వృషభములు మారుదారి వట్టెనో యని పరిపరివిధములఁ జింతింపసాగెను. ఇట్లు సందేహాతరంగితుఁడై కొంతకాలము వేగించునప్పటికి శకటము దృగ్గోచర మాయెను. బండిదగ్గఱకు వచ్చుకొలఁది జారుదత్తుఁడుత్కంఠ యధికమై ప్రియురాలిస్వయంగ్రహాలింగనము కొఱకువ్విళ్ళూరఁ జొచ్చెను.

బండిలో నున్న గోపాలదారకుఁడుగూడ వివిధభావములకు లోనుగాఁ జొచ్చెను ఇచ్చట నీచెట్లతోపులో దాఁగియుండనా

లేక బండి దిగి పాఱిపోవుదునా ? చారుదత్తునియెుదుటఁ బడినచో నామహానుభావుఁడు న న్నాదరించునో లేక రాజభయంబున నేను శరణని వేఁడుకొను చున్నను నిరాకరించునో అతఁడు మిగులధర్మాత్ముఁడు శరణాగత త్రాణపరాయణుఁడు న న్నేల నిరాకరించును.

గీ. అతఁడు నాపడుదురవస్థ నరసె నేని
నిరుపమానపుఁ గరుణ గన్పింపఁ గలఁడు
చిరతరాపదలో మున్గి చివికి యున్న
నాయెుడలు నిల్పినవి తద్గుణములు గావె ?

అని సంకల్పవికల్పములకు లోనై తుదకుఁ జారుదత్తుని దర్శించుటకే నిశ్చయించుకొనెను.

చారుదత్తుఁడు బండియెుద్దకు వచ్చి యందు వసంతసేన యుండుటకు మా రార్యకుఁ డుండుటకు విస్మితుఁడై యతనిరూపమునకు ముగ్ధుఁ డగుచు.

ఉ. ఏనుఁగుగున్నతుండముల కెక్కువ చేతులయంద మున్నతా
పీనతరాంసభాగముల పెక్కువ రక్తసరోజపత్రముల్
బోఁవిలోచనంబులు సమున్నతవక్షము గల్గి యున్న యీ
ప్రాణికి నేలొకో నిగళబంధ మెునర్చిరి కాలి కక్కటా !

అని విచారింపుచు నీ వెవ్వఁడ విట్లు వచ్చుటకుఁ గారణమే మని ప్రశించెను. మహారా జగు నని యెుకసిద్ధుఁడు చెప్పట

వలనఁ గోపించి దుర్మార్గుఁ డగుపాలకమహారాజు తనదోష మేమియు లేనిదే చెరసాలయం దుంచిన యార్యకుఁ డనుగోపాలదారకుఁడనియు మిత్రుఁ డగుశర్విలకుని సహాయమునఁ గారాగారమునుండి తప్పించుకొని దైవవశమునఁ గాన్పించిన బండియం దెక్కి వచ్చితి నని చెప్పి రాజభటుల కంటఁ బడకుండఁ దన్ను రక్షించి పుణ్యము గట్టుకొమ్మని వేఁడుకొనియెను.

చారుదత్తుఁ డొక్కింత దీర్ఘముగ నాలోచించి పరమేశ్వరునకుఁ దక్క మానవులకు జంకుస్వభావము లేనివాఁడును గుణపక్షపాతియుఁ గావున నార్యకునియం దనురాగము వహించి కాలిసంకెల లూడఁదీయించి సురక్షితమగుచోటికిఁ బోవుటకుఁ దనశకటమును స్వేచ్ఛగ నుపయోగించుకొను మనియుఁ దన్ను మఱవవల దనియుఁ బల్కెను ఆర్యకుఁడును జారుదత్తుని యనుగ్రహమును గొండాడుచుఁ బునర్దర్శనము లభించుఁ గాత మని పల్కి సెలవు గైకొని వెడలిపోయెను.

జరుగుచున్న సంఘటనములకు విస్మయమును సంతోషమునువిచారమునుగూడి ముప్పిరిగొన వసంతసేన కేయుపద్రవము సంభవించినదో యని మనమ్మునఁ దహతహ లాడుచు నామె సమాచారమును గనుగొనుటకై చారుదత్తుఁ డంతట మైత్రేయునితోఁ గూడ నింటికి వెడలిపోయెను.

మృచ్ఛకటికము.

అష్టమప్రకరణము

క్రొత్తగాఁ బౌద్ధసన్యాసి యైన సంవాహకుఁడు పుష్పకరండక జీర్ణోద్యానమునఁ బ్రవేశించి యందున్న కొలంకున స్నానాదివిహితకృత్యంబుల నిర్వర్తించుకొని తన కాషాయ వస్త్రముల నారవేసికొనుటకుఁ దగిన స్థలమును వెదకుచు నిటునటుఁ దిరుగాడుచుండెను. ఇంతలో వాని ప్రాణమునకు యమదూతవలె నందొక మూలనున్న శకారుఁడు వీనిని జూచి యచ్చటి కఱుదెంచి క్రుద్ధుఁడై ఖడ్గముఁ జేతఁబూని కొలనిలోఁ దానే యెన్నఁడును స్నానమాచరించి యెఱుఁగననియుఁ బ్రాతయులవగుగ్గిళ్ళవంటి రంగుగల ముఱికిగుడ్డలనందుదికెదవా యనియు దండింపసాగెను.

ఉ. ఫాలముతొల్లి యున్నటులఁ బచ్చగనే తనరారుచుండె శూ
న్యాలకమయ్యుఁ జీవర కృతాంతముగన్పడ దంసకమ్ములన్
జాలదు కావిరంగు వసనంబులకున్నుటచేత గామిచేఁ
జేలపుటంచు నిల్వదు విశీర్ణకమై సరిగా బుజంబులన్.

వీఁడు క్రొత్తఁగా సన్యసించుటచే యుద్యానవనము నీదియనియు, నిం దిట్టి మర్యాదలు కలవనియు నెఱుంగఁడనియు నెఱుఁగని వానిని దండించుట పాపహేతువనియుఁ గావున క్షమింపుమనియు విటుఁడు వాదించుచున్నను, "బాబూ నేనెఱుంగను నన్నేల హింసింతువు. ఇఁక నెప్పుడు నిక్కడ నడుగుబెట్టను ఈ ప్రథమాపరాధమును మన్నింపుము: నన్ను క్షమించినచో బుద్ధభగవానుఁడు నీకు సకలైశ్వర్యముల నొసంగు రక్షింపు" మని సంవాహకుఁడు వేఁడుకొనుచున్నను శకారుఁడు వానిని గాలఁదన్ని యనేకవిధముల బాధించి యింకొక చోటికిఁ బొమ్మని తఱిమివైచెను.

చేటుఁడింకను బండి తోలుకొని రాలేదు. సహజకోపస్వభావుఁడగు శకారుఁడు వానిని నోరారఁ దిట్టుకొనుచుండెను. పాపము వసంతసేన తనకొఱ కిచ్చుట నొక మహావ్యాఘ్రము మెదుకౌ నని యెఱుఁగదు కాని నయనము లదరసాగెను. హృదయము కంపించుచుండెను. తన కేమియాపద కనిపెట్టుకొని యున్నదో యని తహతహలాడుచుఁ బ్రియుఁడగు చారుదత్తుని యొద్ద కేగుచున్నప్పు డీదృశసందేశములకుఁ దావెచ్చటిదని తన్నుఁ దా నోదార్చికొనుచు శకటమునఁ గూరుచుండెను. స్థావరకుఁ డింకను విశేషముగఁ బ్రొద్దుపో లేదని చాల నెమ్మదిగ శకటమును దోలికొనుచు నెట్టకేలకుఁ బుష్పకరండక జీర్ణోద్యానమునకుఁ జేరుకొనియెను. శకారుఁడు పఱుగు పఱుగున వచ్చి

నాయనా చేటా ! చచ్చిపోకుండ వచ్చితివా యని స్థావరకుని బరామర్శించి బండిలోఁ జూచునప్పటికి వసంతసేన కన్నులకగు పట్టెను. వసంతసేన జరిగిన పొరబాటు దెలిసికొని నిర్ఘాంత పోయెను. శకారుఁడు మొట్టమొదట భూతమేమో నని భయముచెంది తరువాత మనసు కుదుటపరచుకొని వసంతసేన తనంత తానే తన్నుఁ గామించివచ్చిన దని సంతోషముచే నోరు చప్పరించి యీనాఁటికి నాపై దయగల్గి స్వయంగ్రహాలింగన మొనర్చుకొనివచ్చితివా ధన్యుఁడ నైతి నని సంతోషసూచకమ్ముగ బండిదిగి యూరగానిల్చిన యామె కాళ్లఁబడి నమస్కరించెను. వసంతసేన మిగులఁ జీకాకుపడి యాతని శరీరస్పర్శమైన నేహావముబ్బునని తలంచి శిరస్సు నావలకుఁ ద్రోసివైచెను.

శకా—నాకఠినశిరస్సు తాఁకుటచే నీఁబువ్వుకోమల మగు నీనాదము నొచ్చియుండవచ్చును. ప్రేమించిన కాంత తన్నినను బహూకరించినట్లే ప్రియురాలా ! ప్రేమించి వచ్చి దూరముగా నుండెద వేమి ?

వసం—అయ్యా ! దైవవశమున నంతయుఁ బొరపాటు జరిగినది. శకటముల వ్యత్యయముచే నిట్లు వచ్చితిని.

శకా—అయిననేమి నాభాగ్యము పండినది. రమ్ము. నన్ను వేధించకుము.

వసం—అయ్యా ! పరానురక్తయగు కాంతవలన మీ కేమి సౌఖ్యము నన్ను నిర్బంధింపఁగఁ బోనిండు.

శకా—కాంతా ! చేఁ జిక్కిన నిధానమును బుద్ధిపూర్వకముగఁ బారవైచికొను వారెవ్వరైన నుందురా ? శకారుని నమ్ముకొనిన వారెవ్వరును జెడిపోవరు. నన్ను వలచినచో నీ మహారాజ్యమంతయు నీ చేతనే యేలింతును.

వసం—ప్రేమకు హృదయము ప్రధానము గాని సంపదలు కాఁజాలవు.

శకా—అట్లయిన నాయనునయములను బెడచెవిని బెట్టెదవా ?

వసం—నామనస్స్వాధీనమై నప్పుడు నే నంతకన్నఁ జేయ వలసిన దేమియును లేదు.

శకా—నన్ను నిరాకరించుట నాతో విరోధమును దెచ్చుకొనుటయే సుమా !

వసం—అయినమాత్ర మేమి చేయఁగలను ?

శకా—ప్రాణములతో నిచ్చటినుండి కదలఁ జాలవు.

వసం—అసహాయురాలగు నొక కాంతపై మీకంత యనుగ్రహము గల్గినను నేను మాత్రము నామనస్సు ద్రిప్పుకొనఁజాలను.

శకా—బావా ! మన మెన్ని చెప్పినను యీమె లొంగునట్లు లేదు. మౌర్ఖ్యమునకుఁ దగిన శిక్ష యనుభవించును. నాయాజ్ఞ గావున నీమెను దక్షణమే చంపుము.

విటు—రామ ! రామ ! శకారా! నీకేమి మతి పోయినదా?

ఉ. ఆఁడుది బాల యీనగరికంతయు మేలివిభూషణంబు రో
చేడియ యయ్యె దానికుల చేష్టలు లేనిది నాకుఁ జంపఁ జే
యాడునె? యాడెఁబోయిటు నిరాగసురాలికి నెగ్గుసేయ నా
కోడలభించ నేర్చునె యయో పరలోకనదిన్ దరింపఁగన్.

శకా—బావా! ఎందుల కీపనికిమాలినభయము. నీవు వసంత
సేనను జంపితివని యొరుల కెట్లు తెలియును. ఒక వేళఁ
దెలిసినను రాజస్యాలకుఁడను నేనుండ నీ కేమి భయము
సందేహింపకుము.

విటు—శకారా! ఎవ్వరును జూచుట లేదని సమర్థింపకుము.

గీ. దెసలు ధర్మానిలులు వనదేవతలును
జంద్రసూర్యులు నంతరిక్షంబు నంత
రాత్మయును భూమి పాపపుణ్యములనెపుడుఁ
జూచుచుందురిఁ కెవ్వరు చూడకున్న.

శకా—బావా! నీ వీ నిరర్థకసందేహములను మానివైచి నాకు
సహాయ మొనర్చినచో నిన్ను గొండయెక్కింతును.

విటు—నీ వెంతకైనను సమర్థుఁడవే కాని నీవు చెప్పినచొప్పునఁ
జేయుటకు నా మనస్సొప్పుకొనుట లేదు.

శకా—నాయనా! చేటా! ఈ ముసలిపంది యెప్పుడును
నధర్మమని జడియుచునే యుండును. నీవైన స్వామి
కార్యము నొనరించి విశ్వాసమును జూపెట్టుకొనుము.

స్థావ—నాకును భయమగుచున్నది.

శకా—ఎందువలన?

స్థావ—పరలోకమువలన.

శకా—నీకు బహుళమగు ధనమొసంగెదను. సేవకావృత్తినుండి తప్పించెదను. జన్మాంతము నందాఁక నొరుల సేవతో నిమిత్తము లేకుండ సుఖముగఁ గాలక్షేపము సేయ వచ్చును.

స్థావ—ప్రభూ! నిరపరాధినియగు కాంతను జంపుటకు నామన స్సొప్పుకొనుట లేదు. సేవకుఁడను ప్రభువాక్యము నిరాకరించితినని కోపగింపకుఁడు.

గీ. తొల్లి నాయొనరించిన దుష్కృతంబు
గర్భదాసుని గావించెఁగాదె నన్ను
నీభవంబున సైత మిట్లే యొనర్చి
యేమి కాఁబోవు వాఁడనో యింక నేను.

శకా—అట్లయిన నేను జెప్పిన పని జేయనందువా?

స్థావ—బాబూ! చేయఁజాలను. మీరీ యుద్యమమునుండి విరమించుటయే శ్రేయస్కరము.

శకా—ఏమీ! నీకుఁ గూడఁ గొమ్ములు వచ్చినవా? ఈనాఁటితో నీ యుద్యోగమునకు స్వస్తియైనది వెడలి పొమ్ము.

స్థావరకుఁడు కండ్ల నీరు గ్రుక్కుకొనుచు నావలకు వెడలిపోయెను.

శకారుఁడు కావలసిన వారు మాటనిరాకరించుటచే ద్విగుణీకృతమగు కోపము గలవాఁడయ్యెను. రాజుగారి బావమఱఁది కావున నదివరకుఁ దనయాజ్ఞ లప్రతిహతముగఁ జెల్లుచుండెడివి. అసలు క్రోతి కల్లుద్రావిన యవస్థ పట్టెను. వసంతసేన జుట్టుపట్టుకొని తానే చంపఁబోయెను. వసంతసేనయొక్క దీనాతిదీనములగు దృష్టులను జూచి విటుఁ డడ్డమువచ్చి నా ప్రాణము లున్నంతకాల మీమెకు హానికలుగనీయ ననియెను. విటుఁడు దగ్గరనున్నంతకాలము తన ప్రయత్నము కొనసాగదు. తెలివిదెచ్చుకొని శకారుఁ డింకొక క్రొత్తయెత్తు నెత్తెను. విటునితో "బావా! నేనుమాత్రము దుర్మార్గుఁడ ననుకొంటివా? నాకుమాత్రము పరలోకమనిన భయము లేదా? దీనిని జడిపించి వశపఱచుకొనుటకు మాత్రమే యిట్లు చేయుచుంటిని గాని మల్లకప్రమాణం బగు కొలంబునఁ బొడమి స్త్రీహత్య కొడిఁగట్టుకొందునా! నేను దీనిని జంపను నిశ్చయము. నీవు నమ్ముమని యొట్టు బెట్టుకొని యీగర్భదాసికి నాయందు నిజముగఁ బ్రేమయున్నను నిన్నుజూచి సందేహించుచున్నది. ఎంత భోగముదియైనను నింకొక పురుషుఁడు దగ్గఱనుండఁగ నొకనితో రహస్యకృత్యములకు సమ్మతించునా! ఒక్కింత తడవు నీవావలకుఁ బొమ్ము! నే నీమెను బ్రసన్నురాలిని. జేసికొందు" నని

బ్రతిమాలుకొనియెను. శకారుఁడు నిజముగాఁ బ్రేమగలవాని
వలె నటించుచుండుటచే విటుఁడు వీనికి నిజముగా మోహము
తలకెక్కినది. కాముకులు ప్రేమించిన వారియెడల నకృత్యమ్ము
లొనరించుటకు సాహసింపఁజాలరని నమ్మి యబలను దిక్కులేని
దానను నీవే యిప్పట్లు నన్ను రక్షించుటకు సమర్థుఁడవు. ఈన
గాచి నక్కలపాలుసేయకుము. ఇంకెవఱును నన్నుఁ గాపాడి
యిప్పు డీరాక్షసునిచేతి కప్పగించి పోవకుమని వసంతసేన
యాక్రోశించుచు బతిమాలుకొనుచున్నను వినిపించుకొనక కను
చాటగు ప్రదేశమునకు వెడలిపోయెను.

దైవముపై భారమువైచి వసంతసేన గడగడ వడం
కుచు నిలువఁబడియుండెను. శకారుఁ డామెదరికిఁ జేరి మరల
ననేకవిధముల నాసగొల్పెను. కాని లాభము లేకపోయినది.
పటీరవృక్షము నాశ్రయించినదానఁ బలాశవృక్షచ్ఛాయ నాకు
రుచించునా యని వసంతసేన మరల వాని దిరస్కరించెను.
శకారుఁడింకఁ గోపమ్ము నిలుపుకొనఁజాలక రెండుచేతుల నామె
గొంతుఁ బిసికెను. ఆమెయు మూర్ఛితురాలై క్రిందఁ బడి
పోయెను. ఇంతలో విటుఁ డుద్యోగము వలదనుటచే వెడలి
పోయిన స్థావరకుఁ డెచ్చటనుండెనో వెదకి శకారుఁ డేమి
దుర్మార్గమును దలపెట్టుచుండెనో దగ్గఱనుండిన మంచిదని
వానిఁగూడ నచ్చటికిఁ దీసికొనివచ్చు సరికీ దృశ్యము కండ్లఁ
బడినది. శకారునిపై మితిలేని యాగ్రహముదయించి చంప

నెంచెఁ గాని చిరకాల సహవాసమే యాతని వెనుకడుగు వేయించెను. ఈ దుర్మార్గుఁ డిచ్చటనున్నచో నపరాధమంతయు నాయందే మోపఁగలఁడు. ఇఁక నీపట్టణమును వీడిపోయి ముందు రాజుకాఁబోవు నార్యకు నాశ్రయించుట మంచిదని నిశ్చయించుకొని,

"సీ. దాక్షిణ్యబలముపఁ దరులు ముంచుచుఁ బాఱు
పౌడపుటేరా యెండి పోతి వయయొ ?
తనలోకము త్యజించి చనుదెంచిన రతీ స
తీ ! పోతివటవె స్వదేశమునకు !
అడుగంటిపోతివా యకట సౌభాగ్య ర
త్నాకరమా ! మన్మథాపణంబ !
చిఱిన వ్రీసుము తిన్నె చిన్నె గైకొన్న సౌ
జన్య నదీపూర్ణ చంద్రవదన !

గీ. నగలు మెయినిండఁ బూని మందగతి మీఱ
నోలుకు సింగారమునఁ బేర్మి చిలుకనీవు
నడచి యేతెంచుటింకఁ గన్పడకయుండఁ
జేసెనే మాలపెనువేల్పు చెయ్యి యకట !"

యని వసంతసేన కొఱకు విచారించుచుఁ బరమదుర్మార్గుఁడగు శకారుని వీడి తన మనోభీష్టమగు తావునకుఁ బోవు దారి పట్టెను.

శకారున కిప్పటికి మనస్సున భీతిదోఁచెను. తనమీఁది కే యుపవాద రాకుండ విటుఁడు దాఁటుటచేత నిఁక నీయ కృత్యమునకు రెండవసాక్షియగు స్థావరకునివలనఁ దన కే ప్రమాదమును రాకుండఁ జేసికొనుటకై వానిని బంధింప నెంచి నేనిప్పుడే వచ్చెదను. నాకొఱకుఁ బ్రాసాదాగ్రప్రతోళిక యందు వేచియుండుమని పంపివైచి వసంతసేన యింకను బ్రతికి యున్నదేమో యని మఱల మఱలఁ బరీక్షించి శవ మెవ్వరి కంటను బడకుండ నచ్చట రాలియున్న పండుటాకుల నామెపైఁ గప్పి యిఁక నీ నింద నాపై లేకుండ నధికరణమునకుఁ బోయి చారుదత్తునిపై నభియోగము దెచ్చెదననియు నిశ్చయించుకొని,

గీ. చారుదత్తుని దేహనాశంబు కొఱకుఁ
దగిన నూతన కపట మీపగిదిఁ గాన
యాగపశువును జంపించినట్లు నేఁడు
దారుణంబుగఁ జంపింతుఁ జారుదత్తు.

అని సంతసించుచు నెవ్వరేని దన్నుఁ జూతు రనుభయమ్మున సగము పడిపోయిన ప్రహరిగోడ దూకి వెలువెత్తెను.

శకారునిచేఁ దన్నులుతినిపోయిన బౌద్ధశ్రమణకుఁ డెల్లెట్లో కాషాయవస్త్రము నుదికికొని చెట్టుకొమ్మ కారఁ గట్టిన వానరములు చింపివేయునేమో యనియు నేలపై నారవైచిన మట్టి యంటుకొనుననియు సందేహించుచు వసంతసేనపైఁ

గప్పఁబడియున్న పండుటాకుల దరి కఱుదెంచెను. ఆకులు కదలుచుండుటయు నిట్టూర్పు సవ్వడి వినవచ్చుటయుఁ గాంచి యతఁడు భయోద్రేకంబున నటమటించుచుండఁ గొంత మూర్ఛదెలిసి వసంతసేన చేయిఁజాచెను. అదిచూచి యాకు గుంపు గదిపి యిదివర కామెవలన మహోపకారమును బొంది యున్నవాఁడు గావున గుర్తించెను. క్రమమ్ముగఁ గొంత తెలివి వచ్చి యామె దాహమని సన్నజేయ దాపున నెచ్చటను నీర ముంగానక యచ్చటనున్న కాషాయార్ద్రవస్త్రమును మీఁదఁ గప్పెను. ఆమెకుఁ బూర్ణముగఁ దెలివివచ్చినది. పిదప బౌద్ధ సన్యాసి తన్నామె కెఱిఁగించుకొని సేవచేర్చుటకై దగ్గఱనున్న బౌద్ధవిహారమునఁ దనకు ధర్మభగినియగు నొక సన్యాసిని యున్నదని తెల్పి యామె నచ్చటకు గొనిపోయెను.

మృచ్ఛకటికము.

నవమ ప్రకరణము

మఱునాఁటియుదయముననే లేచి శకారుఁడు కాలకృత్యముల నిర్వర్తించుకొని వసంతసేనాహత్యాపవాదమును జారుదత్తునిపై మోపి తనమార్గమును నిష్కంటక మొనర్చికొనుటకై త్వరపడుచు నధికరణమంటపమునొద్దకుఁ జేరికొనియెను. అధికరణికు లింకను రాలేదు. సేవకుఁడు మాత్రము మంటపము నూడ్చుచుండెను. శకారుఁడు కొంతసే పిటునటు బిచ్చియెత్తినకుక్క వలెఁ దిరుగాడుచుండఁగ నధికరణికులు వచ్చి న్యాయపీఠము నలంకరించిరి. అంతట శకారుఁడు తా నొక కార్యార్థినై వచ్చితి నని లోనికిఁ గబురంపెను. వీనికిఁ బ్రతిదినము నేదియో యొకయుపద్రవమును గొనితెచ్చు టాచారమగుటచే మొట్టమొదటనే నీవిన్నపమును వినుటకు వీలులే దని యధికరణికులు నిరాకరించిరి. చేయునది లేక శకారుఁడు మా బావగా రగుపాలక మహారాజునకుఁ దెల్పి మీయుద్యోగము లూడదీయింతు నని బెదరించెను. అన్నంతయుఁ జేయఁ

గలఁ డని వారు భయపడి లోనికి రానిచ్చిరి. శకారుఁ డంతట గతదినమునఁ బుష్పకరండక జీర్ణోద్యానమునఁ జారుదత్తుఁడు వసంతసేనను హత్య చేసినాఁ డనియుఁ దాను కనులారఁ జూచితి ననియు నభియోగమును మోపెను. అంతట నధికరణికులు చారుదత్తునకుఁ గబురంపిరి.

వసుహీనుఁడై పశ్చిమాద్రికిఁ జేరఁబోవు చున్న భాస్కరునకుఁ జరమకాల మంతయు నున్నకాంతితోఁ గాలక్షేపము సేయుటకు యోగము కుదిరినది కాదు. శత్రుజీమూత పటలములు ప్రబలములై యాక్రమింపసాగినవి. చారుదత్తుఁడును పుట్టినది మొదలు పరోపకారములఁ జేయుచుండే నాజీవితమును గడపుచుంటిని గాని యెన్నఁడు నేరికి నపకారమును దలపెట్టియైన యెఱుంగనే? పాలకమహారాజు మాత్రము నానడవడియు నాసువృత్తము నెఱుంగఁడా? అధికరణికులు నన్నేల పిలువనంపినారో? ఏదురాత్ములైన నాశకటముపై నార్యకుఁడు తప్పించుకొని పోవుచుండఁ జూచి నాపై నీయభియోగమును దెచ్చియుండరు కద యని వితర్కించుకొనుచు ఘోరమృత్యుసూచకము లగుదుర్నిమిత్తములకుఁ గంపించుచు న్యాయస్థానమును జొచ్చెను.

చారుదత్తుఁడు శకారునిఁజూచి మఱింత యుద్వేగము నొందెను. పిదప వసంతసేనాహత్యాభియోగ మాతనికిఁ దెల్పఁ

బడెను. చారుదత్తుఁడు కలలోనైన నిట్టియపవాదము సంభవించు
నని తలంచియుండలేదు. పిడుగు మొత్తినట్లు నిర్ఘాంతపడి
దైవమా నీ కేమి యపచార మొనరించితి నిట్టియపవాదమును
దెచ్చి పెట్టితి వేల యని దుఃఖించుచుండ నధికరణికు లాతని
వసంతసేనవిషయమై ప్రశ్నించిరి. వసంతసేనకుఁ దనకుఁ దేవాల
యములోఁ బరిచయమైనది మొదలు తనయింటినుండి యామె
వెడలిపోయినంతవరకు జరిగినవృత్తాంత మంతయుఁ దెల్పి
మిగిలినసంగతి యేమియు నే నెఱుఁగ నని చెప్పెను. ఇంతలోఁ
జందనకునిచేఁ దన్నులు దిని పరాభవఖిన్నమానసుఁడైనవీరకుఁ
డరుదెంచి తా మార్యకుని వెదకుచుండఁగ రాజమార్గమునఁ
జారుదత్తుని బండి పోవుచున్న దనియుఁ జందనకుఁ డాబండిని
బరీక్షించి యందుఁ బుష్పకరండకజీర్ణోద్యానమునకుఁ బోవుచున్న
వసంతసేన యున్న దని తనఁబడచుఁ జెప్పి నందున దాను గూడఁ
బరీక్షింపఁ బోవునంతలో నిందు వసంతసేనయే యున్న
దార్యకుఁడు లేడు నేను పరీక్షించితిని నీకు నమ్మకము లేదా
యని తన్నుఁ దన్నె ననియు నభియోగము దెల్పుకొనెను.
చారుదత్తుఁడు విచారముచేత నవమానముచేతఁ గ్రుంగిపోవు
చుండెను. చారుదత్తుని మీఁద సాక్ష్యము ఋజువగుచున్నందుల
కధికరణికుఁడు గూడ వగచి పుష్పకరండకజీర్ణోద్యానమున
నొక స్త్రీ చచ్చిపడియుండెనో లేదో చూచిరమ్మని వీరకున
కాజ్ఞాపించెను. వీరకుఁ డచ్చటికిఁ బోయి యచ్చటఁ బ్రోవుపడి

యున్న యాత్రికులగుంపు జూచి వచ్చి నిశ్చయముగ నందొక స్త్రీ చచ్చి పడియున్న దని తెల్పెను.

చారుదత్తుఁ డేమి చేయుటకుఁ దోఁచక చింతాసాగర నిమగ్నుఁడై రోహసేనునకు సువర్ణశకటము జేయించుకొను మని వసంతసేన యిచ్చిన యాభరణముల నామె కిచ్చివేయవలయు నని పంపిన మైత్రేయుఁ డింకను రాలేదే యాతఁడు వచ్చినచో వసంతసేనవిషయ మంతయు స్పష్టముగఁ దెలిసి యుండును గదా! ఈశకారుఁడు తెల్పిన దంతయు నిజ మగునా యని వితర్కించుకొనుచుండెను. ఇంతలో మైత్రేయుఁ డామార్గముననేఁ బోవుచు హత్యానేరమునకై చారుదత్తుఁ డధికరణమంటపమునకుఁ గొనిరాఁబడె నని విని యేడ్చుచు నచ్చటికి వచ్చెను. వసంతసేనయొక్క నగలమూట మైత్రేయునిచంక యందే యుండెను. ఉద్విగ్నుఁడై యున్నచారుదత్తునివలన వసంతసేనా హత్యాపవాదము తనపై శకారునిచే మోపఁబడిన దని విని కోపముచే నొడలెఱుంగక మైత్రేయుఁడు శకారునితో వివాదమునకు డీకొనియెను. శకారుఁ డూరకొనక కారులు ప్రేలుటచే మైత్రేయునకు మఱింతయాగ్రహము గల్గి వానిని జంపవల దని చారుదత్తుఁడు వారించుచున్నను జేతిలోని కఱ్ఱ నెత్తెను ఈసందడిలో మైత్రేయునికక్షాంతరమునుండి వసంతసేన నగలమూట క్రిందఁ బడెను. అంతట శకారుఁ డొక్కగంతు వైచి యవిగో! వసంతసేననగలు ఆమెను జంపి వైచి ధనము లేకుండుటచే నవి

విక్రయించుటకై దుర్మార్గుఁడు మైత్రేయునిచే నంగడికిఁ బంపుచున్నాఁడని గగ్గోలుఁ గావించెను. న్యాయాధికారులు వసంతసేన తల్లికిఁ గబురంపిరి. ఆమె యరుదెంచి గోలుగోలున నేడ్చుచు నానగల నొక్కొక్కటి తీసి పరీక్షించి యవి వసంతసేనవే యని సాక్ష్య మిచ్చెను.

అన్నియు వ్యతిరేకమైనవి తుదకుఁ బ్రాణమిత్రుఁ డగు మైత్రేయుఁడు మిత్రుని యాపదకు వెతజెంది తెచ్చుకొనిన కోపముగూడ నాతనికి హానిగనే పరిణమించినది. ఎన్నివిధముల నమ్మింపఁ జూచినను నెన్ని యొట్లు పెట్టుకొనినను న్యాయాధికారులు చారుదత్తుని మాటలను నమ్మలేదు దైవము వ్యతిరేకమైనప్పు డెవ్వ రేమి చేయుదురు న్యాయాధికారు లంద ఱాలోచించి చారుదత్తుఁడే హంత యని నిర్ణయించిరి. కొఱత వేయవలయు ననునాజ్ఞ పాలకమహారాజు యొక్క సమ్మతి కొఱకుఁ బంపఁబడెను. మహారాజును వసంతసేన నెవ్వఁడు చంపెనో వానికామెనగలమూట మెడయందుఁ గట్టి యూరేగించి దక్షిణ శ్మశానమునందు శూలారోపణము జేయుఁడని యాజ్ఞయిచ్చెను. చారుదత్తుఁడు తనకు సంభవించిన నిర్హేతుకాపదలకుఁ గన్నీరు మున్నీరుగా నేడ్చుచు స్త్రీహంతకుఁ డని పేరు వడుటకంటె నిట్టి చావే మంచి దని నిశ్చయించుకొనెను.

చారు—మిత్రమా! మైత్రేయా! వసంతసేన పరమపదించిన
దని యిందు మూలముగా ధృవమైనది. నే నామె

మృతికిఁగారకుఁడ నైనను గాకున్నను యీ దుర్భరమైన నిందను భరించి యెవరికోసము జీవింతును? నాకు విధింపఁబడిన యీ శిక్ష న్యాయమైనదే. నీవేగి మదేక ప్రాణమై జీవించియున్న నా జననికి నాకు మాఱుగఁ గడసారి వందనము లర్పింపుము.

మైత్రే—ఇట్టి దురవస్థ సంభవించు నని కలయందైన నే నను కొననైతిని. మిత్రమా! చిన్నతనమునుండి నన్ను రక్షించుచున్న నీ మృతికి నేనే కారకుఁడ నైతినిగదా?

చారు—ఏమి చేయఁగలము. దైవమిట్టి కుతంత్రములఁ బన్ను చుండఁగ మనుష్యమాత్రులము మన మేమి చేయఁ గలము.

మైత్రే—ఇట్టి ప్రాణమిత్రుని నిన్నుఁ బోగొట్టుకొని నేను మాత్రము జీవింపఁ గల్గుదునా? నేనును నీతోడనే వచ్చి ప్రాణత్యాగ మొనర్చి కొందు ననుగ్రహింపుము.

చారు—మిత్రమా! ఇది యేమివెఱ్ఱి? నాకొఱకైనను నీవు తప్పక జీవింపవలసి యున్నది.

మైత్రే—అదియేమి? నన్నెందులకు జీవింపుమని శాసించెదవు?

చారు—మదేకపుత్రుఁ డగు రోహసేనుని నీవు పోషించి రక్షించ వలసియున్నది. వానికి నీకంటె రక్షకులెవ్వరును లేరు. ఎప్పుడును మిత్రవాక్యము నెదిరించి యెఱుంగని వాఁడ వీనాఁడు మాత్ర మట్టి పనిజేయుదు వని నేను తలఁపను.

మైత్రే—మొదలు విఱిఁగిపడిన వృక్షమును బోషించిన మాత్ర మేమి ప్రయోజనమేమి ?

చారు—సర్వశాస్త్రము లెఱిఁగినవాఁడవుగదా ! మిత్రమా ! మైత్రేయ ! నీవు గూడ నిట్లు పల్కుచుంటివేమి ! పుత్రులు లేనిదే పితరులకుఁ బుణ్యలోకములు సున్న.

గీ. పుణ్యలోకంబు లందున్న పురుషులకు శ
రీరముల మాఱుట సుమీ కుమారుఁ డనఁగ
నీకు నా యందుఁ గల పేర్మి నా కుమారు
నందు జూపించి వానిఁ గాపాడుమయ్య.

మైత్రే—మిత్రమా ! నీ వెన్ని చెప్పినను నిన్ను విడిచిపోవుటకు నాకు బుద్ధి పుట్టుట లేదు.

చారు—గ్రహచారమును తప్పించుకొననేరము. ఈ రూపము గ్గనైన నీ మిత్రుని ఋణమును దీర్చుకొనుము.

మైత్రే—అట్లయిన నీ యిష్టము.

చారు—నెచ్చెలీ ! మాటమాట ! ప్రాణావసానసమయము గావున నా కుమారు నొక మారు తీసికొని వచ్చి నాకుఁ జూపించుము. నీవు నాకుఁ జేయవలసిన యుపకార మిం తకు మించి లేదు. వేగ మేగి వానిని దీసికొని రమ్ము.

చారుదత్తుని యాజ్ఞ వడసి మైత్రేయుఁ డింటికి వెడలిన తరువాతఁ ద్వారగర మ్మను చున్న తలారులవెంటఁ జారుదత్తుఁడు దక్షిణ శ్మశానవాటికకుఁ బయనమయ్యెను. శకారుని సంతసమునకు మితియే లేదు తాను జేసిన యపరాధమును దన గర్భశత్రువుతలపై మోపుట యందు జయము గాంచితిఁ గదా యని యపరిమితానందమును గాంచుచు నాతని చావు గూడ దగ్గఱ నుండి యీక్షించి కృతకృత్యుఁడ నయ్యెద నని శకారుఁడును వెంటనే బయలుదేఱెను.

మృచ్ఛకటికము.

దశమ ప్రకరణము

గీ. సుజన శకురాధివాసమై సొంపుఁ గాంచి
ఖ్యాతిఁ గాంచిన యొకసజ్జ నాగమంబు
నఱకుచున్నార మిదె కాల పరశుధారఁ
జూచుచున్నా రిదేలొకో చోద్య మరల.

జనులారా! దారియిండు తొలంగుఁడు మార్గమధ్యమునఁ దొలంగుఁడు నృపాపథ్య మొనరించు వారలకుఁ గ్రూరకర్మములఁ జేయు వారలకు నిట్టికఠిన శిక్షలే తప్పక విధింపఁ బడును. మీర లందఱును బుద్ధికలవారలై పాపకార్యముల జోలికిఁ బోవక న్యాయముగఁ బ్రవర్తింతురుగాత ' యని చాటింపుచు నిరువురు చండాలురు గన్నేరుం బువ్వుదండ గంఠమునవైచి యూరేగించుచుఁ జారుదత్తుని దక్షిణ శ్మశానమున నున్న వధ్యస్థానము నకుఁ గొనిపోవు చుండిరి. హఠాత్సంభవమైన యీవృత్తాంత మాలించి యుజ్జయనీ నగరమందలి ప్రజలందఱు నేల యీనిన ట్లావైపునకే వచ్చి పడుచుండిరి. పాటిమానవుని జంపుటకుఁ గొనిపోవుచుండ నిచట నేమివింతఁ జూచెదరు మీకుదయాధర్మ

ములు లేవా? దారికడ్డము రాకుఁడు తొలంగినచో శిక్షింప వలసి వచ్చునని రాజభటు లదలించుచున్నను జనులు గుంపులు గుంపులుగా వచ్చి చూచి చారుదత్తునకుఁ గడసారి యశ్రుని మీలితలోచనులై నమస్కరించి వెడలి పోవనివారే లేరు. ఆమహానుభావుని నామప్రభావ మటువంటిది సజ్జనులకు దైవవశమున నాపదలు వచ్చిన నాఁడు వగవని కఠినహృదయు లుండరు "రామ! రామ! తనకున్న సర్వస్వమును ధారవోసి యెందరి కెన్ని యుపకారములు చేసినాఁడు ఆచిరసుకృతమైన నీయాపద నుండి వీనిని రక్షించుటకు శక్తిమంతము కాక పోయెనే" యను వారును, "సర్వజన మాననీయతఁ గాంచిన పుణ్యాత్ముఁడు వధ్యపశువుగా మారిపోయెనే" యనువారును, "యెంతసుకృతవంతుఁడైన నేమి? ఎంటి ధర్మాత్ముఁడైన నేమి? మానవుఁడై పుట్టరాదు. మానవదేహి కెంతమతి మంతునకైనను గష్టములు రాకమానవను రను, "చీ! చీ! యుక్తాయుక్త వివేచన జ్ఞానములేక దుర్మార్గుడగు పాలకమహారాజిం దుండగ మొదిగట్టెనా? వాని కేమి చేటు మూడనున్నదో" యనువారును, "మనమేమి చేయఁగలము రాజసలే దుర్మార్గుఁడు మనమాటలు వినినచో రాజభటులు మనకుఁ గూడ ముప్పు గల్గింతు" రను వారును, "నుశిపూస వంటివానికి మసిబొగుతో నేటికి సంబంధము సంభవించెను కటకటా! కుటిలస్వభావు రాండ్రగు వారకాంతలఁ దడవిన వారికిటువంటి కష్టములు తప్పవను వారును,

గీ. కీడ్పడిన మీఁద జనుఁడు సుఖంపవచ్చుఁ
గటిక చీఁకటిలో దివ్వెఁ గాంచినట్లు
మేలనుభవించి పిదప లేమి వడెనేని
వాఁడు నిజముగ జీవచ్ఛవంబు చూవె!

ఈమహానుభావుఁడు దరిద్రుఁడై జీవించుట కంటె మరణించుట యేశ్రేయస్కరము కానియీదుర్మరణము మాత్రము శోచనీయమనువారునై చూడ వచ్చిన జనులందఱును బరిపరి విధముల నాడుకొనుచుఁ గంటనీరు వెట్టుకొనుచుండిరి. మేమందఱ మీతని వలన నంతయో యింతయో యుపకారములను బొందియుంటిమి అల్పులమగు మేమీ విపత్సమయమున నీతనికిఁ బ్రత్యుపకారముజేయఁ జాలక పోయితిమిగదా! మామనః పూర్వక ప్రార్థనమాలించి యీమహానుభావునకు నీచారుదత్తునకుఁ బరలోక సౌఖ్యమైనను గావింపుమని భగవంతున కాప్తులగువారు మ్రొక్కుచుండిరి. చారుదత్తునకై పలవించుచు వెనువెంటనే వచ్చుచున్న జనుల కన్నీటి ధారలచే ధరాపరాగ మడఁగి పోయెను. స్త్రీలందఱును వీథి వెంబడి నూరేగించుచుఁ దీసికొని పోవుచున్న చారుదత్తుని వాతాయనార్గళవిముక్తలై ముఖములతో నెంత వానికెంత గతి పట్టినదో యని యడలుచుఁ గన్నీటి బిందువులచే నకాలవర్షాగమమును సూచించిరి. చండాలురును బ్రతి ఘోషణస్థానము నొద్ద డిండిమమును వాయించుచుఁ జారుదత్తుఁ డొనర్చిన యపరాధమును దానికై మహారాజు

విధించిన శిక్షయుఁ దెలుపుచు నెవ్వరే నిఁక ముందిట్టి దుష్కార్యము లాచరించుచో నిట్టి కఠిన శిక్షయే యనుభవింపఁ గలరు. కావున జాగ్రత్త వహింపుఁడని చాటింపుచుఁ జారుదత్తుని గొనిపోవుచుండిరి.

నిరపరాధియు సుగుణవంతుఁడు మఱియు నగు చారుదత్తుఁ డీదృశ్యము నంతయుఁ జూచుచు సహింపలేక దుర్మార్గుఁడగు విధి చెయిదములను దూషించుచుఁ బరాభవభారముచే ఖిన్నుఁడై కన్నుల వెంబడి బాష్పములురలుచుండ దీనాతిదీనములగు దృష్టులతోఁ దన్నుఁ జూడ వచ్చిన జనుల నాలోకించుచు నిట్లు వాపోవఁ దొడంగెను.

ఉ. స్కంధమునందు శూలమును గంఠమునన్ గరవీరమాలహృ
ద్బంధితమైన శోకమును దాలిచి పోవుచునుంటి మారణ
గ్రంధము విన్పుచోటికి వికారముగా శమిత్రప్రబంధ సం
బంధముకల్గుచోటికి సవంబునఁబోయెడు మేకచాడ్పునన్.

గీ. సుఖశతాలంకృతంబైన మహాకులమున
కార్యసాధ ఖ్యాతి యిడితిఁ జైత్యాదికముల
మరణదశయుం దశదృశ మనుజు లకట
నన్నుఁ బాపిగ చాటించుచున్నవారు.

ఇట్లు దుఃఖించుచుండ రోహసేనుని దీసికొని మైత్రేయుఁడు జనుల మధ్యనుండి యతికష్టముతో దారి జేసికొనుచుఁ జారు

దత్తుని సమీపించెను. తన కొఱ కేడ్చుచున్న కుమారుని జూచి దుఃఖము పొంగిపొరలి వచ్చుచుండ నెట్టకేల కాపుకొని. కష్టకాలమున దరిజేరిన కుమారున కేమొసంగుదునా యని దీర్ఘముగ నాలోచించి పుత్రునంక తలమునఁ గూర్చుండఁ బెట్టుకొని యాతని కన్నీరు దుడిచి "నాయనా! రోహసేన! నీ తండ్రి వలెఁ గాక నీవు జాగరూకుఁడవై యాగతానాగతముల విమర్శించుకొనుచు జీవింపుము. ఈ మైత్రేయుఁడే నీకును నాకును గూడ రక్షకుఁడు. నాకుమారుగ మైత్రేయుని జనకునిగా భావించుకొనుము. కులమర్యాద లతిక్రమింపకుము. సన్మార్గులపై నకారణముగ దాడి వెడలి వారల కాపద లొనరింపఁ జూచువారనేకు లుందురు. దుర్జనుల కదిసహజ స్వభావము. అట్టి వారల నెన్నడు నే మారియుండకుము. పున్నరకమునుండి నన్నుద్ధరింపజనించిన పుత్రుఁడవగు నీ విచ్చు నివాపజలంబులే నాకుఁ బరలోకమున కాధారము. ఇదిగో యజ్ఞోపవీతము విహితకర్మానుష్ఠానమున నెన్నడును వెనుకంజ వేయవలదు సుమా యని బోధించి తన మెడ యందున్న యజ్ఞోపవీతమును దీసి బాలున కలంకరించి చిరాయుష్మంతుఁడవై వర్ధిల్లుమని మనసార దీవించెను.

నిరపరాధి యగు నా తండ్రిని వదలి యాతని బదులుగ నన్ను జంపుఁడు. పితౄణము నీవిధముగఁ దీర్చుకొందునని రోహసేనుఁడును, నా మిత్రుని గరుణాళులరై వదలి వేసి

నన్నురిదీయుఁడు మిత్రకార్యమునకై యసువుల దొఱంగిన
విఖ్యాతి నాతఁ జేకూర్చుఁ డని మైత్రేయుఁడును దీనాతిదీనముగ
గోలపెట్టుచుండఁ గ్రమముగా నూరేగింపు శకారుని ప్రాసాదము
నొద్దకు వచ్చెను.

తన రహస్యమును వెల్లడించి తన కెచ్చట ముప్పు
గల్పించునో యని నాఁడు దుర్మార్గుఁ డగు శకారుఁడు తన
కొఱకుఁ బ్రాసాదాగ్రప్రతోళికయందు నిరీక్షించు చుండుమని
యాజ్ఞాపించి యింటికి వచ్చిన యనంతరము స్థావరకుని నిగళ
బద్ధుని గావించి యామేడపై నుంచెను క్రింద జండాలుర
చాటింపు విని స్థావరకుఁడు "ఏమేమీ ! సకలజన పూజితుండును
సతత సన్మార్గవర్తనుఁడు నగు చారుదత్తుఁడా వసంతసేనను జంపి
నది. ఔర! మీయవివేకముకాల! అందుకొఱ కాతని నురిదీయు
చుండిరా ! ఛీ! ఛీ! ఏమి న్యాయస్థానములు ఏమి న్యాయాధి
పతులు దున్నయీనిన దనిన దూడను గట్టివేయుఁ డనుటయేనా
మీన్యాయ పరిపాలనము. ఇట్టి నిరపరాధు లగు నెందఱో ప్రాణ
ములను నీరిపాలఁ బెట్టుకొను చున్నారోగదా ? భగవానుఁడా
నీవెందణాగ పోయితివి. ఒకఁడు చేసిన నేరమున కింకొకఁడు
శిక్షార్హుఁడా ! నీకేయింతటి విచక్షణాశక్తి యున్నప్పుడు మానవ
దేహధారులగు నీన్యాయాధిపతులను నిందించుట యెందులకు ?
పరమచండాలుఁ డగు శకారుఁ డంతటి ద్రోహమున కొడి గట్టి
నాఁడా ? నేనెట్లైన నీమహానుభావున కుపకార మొనరించి తీరవ

లయు నని యోజించి గొంతెత్తి వసంతసేనను జంపిన వాఁడు శకారుఁడుగాని చారుదత్తుఁడు కాఁడు. అన్యాయముగ నొక నిరపరాధి జీవములను హరింపకుఁడు సాక్ష్య మిచ్చుటకు నేను సిద్ధముగ నుంటినని కేకవైచెను. కాని పాపమాతఁ డేమి చేయును సంకుల మగు నాజనసమూహము యొక్క కోలాహలమునం దెచ్చటనో మేడమీఁదనున్న యాతని కేక లెవ్వరికి వినిపించును? జనసమూహము క్రమముగా ముందునకు సాగిపోవుచుండెను తన కేక లెవ్వరికిని వినబడకుండుట గ్రహించి స్థావరకుఁ డిఁక నూరకున్నచో లాభ మిసు మంతయు నుండదు నిష్కారణముగ నీసజ్జనుఁడు మడియును. నామాట కేమి? సకలార్థి జనకల్పభూజ మగునొక మహాత్ముని రక్షించుటకు నావంటి యల్పుని ప్రాణములు పోయిన మాత్ర మేమి? ప్రపంచమున కేమిలోటని నిశ్చయించుకొని నిగళబద్ధుఁ డయ్యుఁ దెగించి మేడమీఁది నుండి క్రిందకు దుమికెను. దుముకుట తోడనే దైవానుగ్రహము వలన నిగళములూడి పోయినవి. స్థావరకుఁడు వెంటనే చండాలుర యొద్దకుఁ బరువెత్తుకొని పోయి యాదినుండి యంతము వరకుఁ బూసగ్రుచ్చినట్లు వసంతసేనా హత్యా వృత్తాంతము నెఱిఁగించెను. అప్పుడు తానొనర్చిన మహాకార్యమునకు సంతసింపుచుఁ జారుదత్తుని వధ గన్నులారఁ జూడవలయునని వచ్చిన శకారుఁడచ్చటనే యుండెను. స్థావరకుని జూచుట తోడనే శకారునిమీఁది ప్రాణములు మీఁదికెగిరిపోయెను. కోపముచే నోడ

లంతయుఁ గంపించెను భయముచే నోడలంతయుఁ జెమటపట్టినది. కాని తత్క్షణమే తెలివి దెచ్చుకొని ధైర్యమువహించి శకారుఁడు నాయనా ! చేట ! ఈవిపత్సమయమున నీవు నామాన ప్రాణములు రక్షించినచో నీ కాజన్మాంతమును గృతజ్ఞుఁడనై యుందును. నీకెంతయో మేలు సమకూర్చెదనని రహస్యముగఁ బలికి కొంత బంగారమును స్థావరకుని చేతిలోఁ బెట్టెను. కాని స్థావరకుఁడు నిరాకరించెను. రాజస్యాలకుఁ డింకఁజేయునది లేక యుంకొక యెత్తునెత్తి వానిచేతిలో నున్న బంగారము నూడలాగికొని యందఱికిని జూపి ఈగర్భదాసుఁడు నాయింటిలో బంగారమును దొంగిలించినాఁడు అందుచేత వీనిని మేడమీఁద శృంఖలాబద్ధుని గావించి వచ్చితిని. ఎట్లు తప్పించుకొని వచ్చినాఁడో కాని యాకారణముచే నామీఁదఁ బగఁ దీర్చుకొనుట కిట్లబద్ధ మాడుచున్నాఁ' డని తెల్పెను. జనులందఱును నిజమే కాఁబోలు నని స్థావరకుని బలు విధముల దూషించిరి. శకారుఁడు సామంతుఁడు ఈలోకము ధనమూలము. ధనమునకుఁ జలామణి యున్నట్లు దేనికిని నుండదు పలువురును ధనవంతుఁ డబద్ధము లాడుచున్నను నమ్మెదరుగాని ధనహీనుఁడు సత్యమును పల్కుచున్నను నమ్మరు. అందునను సేవానైచ్యము. ఇంక స్థావరకుని మాటలను నమ్మువారెవ్వరు ? నాచేత నైనంతయు శక్తివంచన లేకుండఁ బ్రాణములకైన నాసింపక చేసితిని. నామాటలను మీరు నమ్మకున్నచో నమ్మింపఁ దగిన సాధన

మానాయొద్ద లేదు. ఈ ఘోరకృత్యమునకు రెండవసాక్షియగు విటుఁ డెచ్చటికేగెనో తెలియుట లేదు. ఇఁక సాధనమేమి? భగవంతుఁడు గూడ నా ప్రయత్నముల కంతరాయమును గలిగించుచున్నప్పు డూరకుండవలసినదే నని లోపలననుకొని పాపము స్థావరకుఁడు గ్రుడ్ల నీరు గ్రుక్కుకొన సాగెను. నిర్భాగ్యుఁ డనగు నాపై జాలివహించి నాకు సహాయము జేయ వచ్చిన వారికిఁ గూడ నీదృశమగు పరాభవము సిద్ధించుట న్యాయమేనని చారుదత్తుఁడు మఱింతగ విచారించెను.

ఇంకను నాలస్య మొనరించిన యెడలఁ దన పాపకృత్యమునకు సాక్షులగు వారెవ్వరే నఱుదెంచి చారుదత్తుని విడిపింతురేమో నను భీతిచేఁ ద్వరగఁ గొఱత వేయుఁ డని శకారుఁడు చండాలురను హెచ్చరించెను. చండాలు రిరువురియందును వీరకుఁ డను వాఁ డొకఁడు. వానికిఁ దండ్రి తన మరణసమయమున "నాయనా! నీకుఁ గూడ నావంటి యుద్యోగమే వచ్చునెడల నెవ్వరినైన వధింపవలసివచ్చినప్పుడు నిర్ణీత కాలమునకే గాక మఱియొక ముహూర్తము వేచి చంపుచుండుము. ఏమందువా? ఎప్పుడైన నే సాధుపుంగవుఁడైన దయ వహించి వధ్యుఁ డగు వానిని ధన మొసంగి విడిపించవచ్చును. రాజునకుఁ గుమారుఁడు కల్గుచో నా మహోత్సవకాలమున నందఱికిని విడుదల కావచ్చును. లేదా రాజు మారిపోయినచో నప్పు డందఱకు ముక్తి కలుగవచ్చును. అదియును

గాక పోయిన జనసామాన్యవిప్లవములు బయలుదేఱవచ్చును. ఇంతులకు భిన్నముగ నీవు నడచుకొనినచో మాతాపితృగతు లకుఁ దప్పినట్లే!' అని యుపదేశించి యొట్లు బెట్టించుకొని యెను. వీరకుఁ డీవిషయమును రెండవవానికిఁ దెల్పి యెవ్వరికి వంతు వచ్చునో చీట్లు వైచి కొందఱ మనియెను. వీరకునకే వంతు వచ్చి నందున శూలారోపణము ముహూర్తకాలమనొప్పు చేయఁబడెను.

బౌద్ధవిహారమున సంవాహకునకు ధర్మభగినయగు నామె చేసిన సేవలవలన వసంతసేనకుఁ బూర్తిగ బలము కలిగి నది. సంవాహకుఁ డీఁక నామెను దీసికొని పోయి చారుదత్తుని యింట దిగఁబెట్టుటయే యుక్తమని తలంచి వెంటఁబెట్టుకొని రాజమార్గమున వచ్చుచుండెను. చండాలుర ఘోషణమును విని వారలిద్దరు నదియేమియో తెలిసికొనవలయునని వడివడిగ నడచి వచ్చుచుండిరి కొంతదూరమరుగు నప్పటికి నిజమెఱింగిరి వసంతసేన తన మూలముననే ప్రియుఁడు మడియుటకు సిద్ధముగ నుండె నని వగచి యెట్లైన రక్షించుకొనవలయునని సంవాహకుని బేరేచి శక్తి కొలఁదిఁ బఱువెత్తుకొని వచ్చుచుండిరి. వీరకుఁడు గడువుకోరిన ముహూర్తకాలమును గడచి పోయెను. శకారుఁ డీఁక నొక్క క్షణమైన నాలస్యము చేయుటకు వీలుకాదని తొందర గొల్పుచుండ వీరకుఁడు చారుదత్తుని వెల్లకిలఁ బరుండఁబెట్టి శకారుని యాదేశము ప్రకారము శూలారోప

మును మూసివైచి తలఁ దఱుగుటకే నిశ్చయించుకొని కత్తి నెత్తెను. కాని వానిచేతినుండి కత్తి జారి పోయెను. ఇది యపశకునము మనము రాజాజ్ఞయే నెరవేర్పుదము. భగవత్కృపచేఁ జారుదత్తున కీయాపద తప్పిపోవునేమో యని వారలిరువురు నంతసించుచు శూలారోపణమునకై యత్నింపఁదొడఁగిరి. ఇంతలో భిక్షుక వసంతసేన లిరువురు వలదువలదని వారించుచువచ్చిపడిరి. వసంతసేన యొక్క యదటునఁ జారుదత్తుని కౌఁగిటిలోఁ జిక్కించుకొని ప్రియసఖా! నేను జీవించియేయుండగా నాకొఱకై ప్రాణత్యాగ మొనర్చుట న్యాయమేనా యని దుఃఖింపసాగెను. వసంతసేనను జూచినతోడనే శకారుఁడు పిడుగు మొత్తిన వాని చందమున నిశ్చేష్టుఁడై కొంత వడికిఁ దెలివి దెచ్చుకొని తన పాపము బ్రద్దలైనందులకు వగచి యాత్మరక్షణమునకై పాఱిపోవఁ దొడఁగెను. ఈ సంగతిని గని పెట్టి చండాలు రిరువురును వానిని బట్టుకొనుటకై వెన్నంటిరి.

గీ. మృత్యుముఖముననే నున్న యపుడు నీవు
తరలు కన్నీటఁ గుచములఁ దడుపుకొనుచు
బ్రతుకఁగాఁ జేయ నెటనుండి వచ్చినావు
వెఱపు పుట్టింపఁగా మంత్ర విద్యవోలె.

వని చారుదత్తుఁడు సంతోషాతిరేకముచే నామెను బ్రశ్నింపఁగా వసంతసేనయు బండ్లు తారు మారగుటచేఁ దాను శకారుని

యుద్యానమునకుఁ బోవుట మొదలు మరల భగవదనుగ్రహముచే బౌద్ధసన్యాసి యైన సంవాహకుఁడు తన్ను రక్షించుట వరకును దెల్పి ప్రాణావసాన సమయమందుఁ బ్రాణేశ్వరుని రక్షించుకొనఁ గల్గితినిగదా యని భగవంతునకుఁ గృతజ్ఞతాపూర్వక నమస్కారముల నర్పించెను. అనాథ నాథుఁడగు నిందిరారమణుని నమ్మిన వారికేనాఁటికిని నాపదలుండఁ జాలవని చారుదత్తుఁడు నాదయామయున కంజలి బంధించెను.

పాలకమహారాజుపైఁ బ్రజల దఱకు నవిశ్వాస మధికమై యార్యకుని సేనాధిపత్యమున నాతనిపై దండెత్తి యజ్ఞవాటిక యందుండఁగాఁ జంపివైచిరి. ఇంతవరకు నార్యకునకు సహాయమాచరించుచున్న శర్విలకుఁడు చారుదత్తు నురిదీయుట కాజ్ఞయయ్యెనన్న సంగతి నాలించి యాతని ప్రాణమునెట్లైన రక్షించి తన కృతజ్ఞతను జూపుకొనవలయు నని త్వరగనే తెంచెను. ఆతఁడు వధ్యస్థానమును జేరుకొను నప్పటికి జారుదత్త వసంతసేన లిరువురు నమందానందమునఁ దేలాడుచుండిరి. ప్రజలు జరిగిన సంఘటనములనుతలంచుచు సంతోషార్ద్ర తరంగములనూఁగాడుచుండిరి. ఇంతలోఁ జండాలురు శకారుని బంధించితీసుకొనివచ్చి చారుదత్తుని యెదుటఁ బెట్టిరి. ఇట్టి యవాంతరములకు గారకుఁడైనరాష్ట్రియ స్యాలకునకుఁ దగిన శిక్ష విధించుట తప్పదని శర్విలకుఁడు కోరుచున్నను, బ్రజలందఱు నీపాపాత్మునకుఁ జారుదత్తునకే శిక్షవిధింపఁబడెనో యదియే తగినదని త్వర బెట్టుచున్నను

సహజోదార స్వభావుఁడగు చారుదత్తుఁడు విరోధియైనను హింసింపకుండుటయే తగిన శిక్ష యని శకారుని వదలివైచెను.

భర్తృశిక్షావార్త చెవిఁబడి నంతటనే తాను బ్రతికి యుండుట నిరర్థకమని తలంచి చారుదత్తుని యిల్లాలగు ధూతాంబ చితిఁ బేర్పించుకొని కుమారుఁడగు రోహసేను "డమ్మా! నన్ను దిక్కుమాలిన వానిఁ జేసి తండ్రితోపాటఁ నీవును నన్ను వదలి వైచెదవా" యని యేడ్చుచుఁ జీర చెరఁగ లాగుచున్నను, మైత్రేయుఁడు తల్లీ! కుమారుని మొగము జూచి యైన నీ వీ సాహసమును మానుమని బోధించుచున్నను వినిపించుకొనక యగ్నిజ్వాలయందుఁ బ్రవేశింపనెంచుచుండెను. ఈ సంగతి చారుదత్తునకుఁ దెలిసినది. ఆతఁడును విచారాతిశయముచే నితికర్తవ్యతామూఢుఁడై నిశ్చేష్టుఁడై యుండ నాలస్య మొనర్చినచో ధూతాంబ తమకు దక్కదనియుఁ దరువాత విచారించి లాభముండదనియుఁ దలపోసి శర్విలకుఁడు ధైర్యము దెచ్చుకొని చారుదత్తు వచ్చటికిఁ గొంపోయెను. చారుదత్తుని గాంచినతోడనే ధూతాంబ సంతసించి ప్రాణత్యాగప్రయత్నమును మానివైచెను. జీవితేశ్వరు బ్రతికించి నాకు మరలఁ జూపించితిరి నీ యంత పుణ్యాత్ములు లేరని ధూతాంబయుఁ బ్రాణేశ్వరు శిక్షావార్త చెవిఁ బడి నంతనే జీవములఁ బాయఁదలఁచిన నీ పాతివ్రత్యము సంస్తవనీయమని వసంతసేనయు నన్యోన్యము, గొండాడుచుఁ బరస్పరముఁ గౌఁగిలించుకొనిరి.

శర్విలకునితో నాలోచించి చారుదత్తుఁడు తన కుపకార మొనరింప నెంచిన చేటుఁ డగు స్థావరకునకు దాస్యవిముక్తి నొనరించెను. ఆర్యకుఁడు సులభముగాఁ దప్పించుకొనుటకుఁ గారకుఁడైన చందనకునకు దండపాలకాధికార మీయఁబడి రాష్ట్రియస్యాలకుని స్థానమున నియమింపఁబడెను.

శా. చారిత్రంబు పవిత్రమయ్యె, రిపుఁడస్మత్పాదముల్వట్టె మ
త్తారాతిన్ బరిమార్చి యార్యకుఁడు రాజయ్యెన్ సుహృ
న్మౌళి, త, స్త్రీరత్నంబగు ప్రేయసిన్ జెలిమికానిన్ నిన్నుఁ
గన్గొంటి నేఁ, గోరంగాఁ దగు నట్టి దేది యిఁక నాకుం
జెప్పుమా ! మిత్రమా !

అని సంతోషితస్వాంతుఁడై చారుదత్తుఁడు శర్విలకుఁతో వచించి భగవద్విలాసము నీపగిది నుతించెను.

ఉ. కొందఱి లోచెప్పెనర్చు మఱికొందఱి హెచ్చొనరించుఁ
గొందఱిన్, గుందఁగఁజేయుఁ గొందఱి కనూనముదంబు
ఘటింపఁజేయు ని, ట్లందఱి కన్నిరీతుల మహావ్యసనోదయ
ముల్పొనర్చుచు, న్నందునఁ జెప్పుచుండ్రు విధి కందఱు
నేతపుఁగుండ న్యాయమున్.

సమాప్తము.

For Copies Apply to:

Kollury Subrahmanyam,

KONKUDURU, P. O.

Ramachandrapuram Tk,

East Godavari.